J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 40 8.03.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## ఆంధ్రాలో.. గ్యాంగ్‌వార్



### రాష్ట్రం విడిపోయాక రాజకీయ స్వరూపమే మారిపోయింది!

రెండు దేశాలు పోరాడితే అది యుద్ధం.
రెండు పార్టీలు తలపడితే అది రాజకీయ పోరు.
వీధుల్లో తిరిగే రెండు రౌడీమూకలు
తన్నుకుంటే అది ముఠాపోరు.
ఇద్దరు వ్యక్తులు కొట్టుకుంటే అది తగువు.
అదే కులాలు విడిపోయి, వర్గాలు వైరైపోయి,
కుటుంబాలు చీలిపోయి, మంచీ చెడు,
ఉచ్చం నీచం మరచి రచ్చకెక్కితే
అది ఖచ్చితంగా గ్యాంగ్‌వారే.
కాబట్టి ఇప్పుడు ఆంధ్రాలో జరగబోయేది
ముమ్మాటికీ గ్యాంగ్‌వారే.

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే ఎన్నికలని "క్లాస్‌వార్" అని ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రతి సభలో చెప్తున్నారు. రేపటి ఎన్నికలు ధనిక వర్గాలకి, పేదోళ్ళకి మధ్య జరిగే యుద్ధంగా చిత్రీకరిస్తున్నారు. అలా అని చెప్పి వైసీపీలో అందరూ పేదోళ్ళకే టిక్కెట్లు ఇస్తున్నారా అంటే అనుమానమే. ఆ పార్టీ తరఫున బరిలో దిగేవాళ్ళంతా కోట్లకి పడగలెత్తిన వారే. పెద్ద పెద్ద ప్యాలెస్‌లలో నివసించేవారే. ఒక్క వైసీపీలోనే కాదు అన్ని పార్టీలలోనూ ఇదే పరిస్థితి. దివంగత మాజీ ఎన్నికల ముఖ్య కమిషనర్ టీ.ఎన్.శేషన్, ఎన్నికలలో డబ్బు వరదలై పారకుండా షరతులతో కూడిన నిబంధనలు విధించారు. విచ్చలవిడి ఖర్చుని, అడ్డగోలు పంపకాలని నియంత్రించడానికి చట్టం తెచ్చారు. కానీ, నేటి పార్టీలూ, నాయకులు తాము లెక్కలు చూపకుండా అక్రమంగా కూడబెట్టిన నల్లడబ్బుని ఎన్నికల సమయంలో లెక్కలేకుండా ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి కోట్లు కుమ్మరిస్తున్నారు.

ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ పంపకంలో ఒకడుగు ముందు కేశారు. భారతదేశంలోనే ఒక కొత్త సంస్కృతికి తెరలేపారు.

10లో






శ్రీమతి అశోక్ శశికళ గారు

జననం : 18.10.1953 నిర్యాణం : 4.3.2024

## శ్రద్ధాంజలి

మా ఇంటి దీపం, మా కంటి రూపం
మా అభివృద్ధికి స్ఫూర్తిని ప్రసాదించి
మా కుటుంబ కీర్తిని ఇనుమడింపజేసిన ఆదర్శమూర్తి

**శ్రీమతి అశోక్ శశికళ గారు**

మార్చి 4వ తేదీ సోమవారం స్వర్గస్తురాలైనారు.

**ఆ పుణ్యమూర్తి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**

**అశోక్‌రెడ్డి** - భర్త
**చందన్, చరణ్** - కుమారులు
**వేమిరెడ్డి కోటారెడ్డి** - అన్న
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**, రాజ్యసభ సభ్యులు - తమ్ముడు

### ఉత్తరక్రియలు

వారి ఉత్తరక్రియలు తేది. 14.03.2024 గురువారం
ఉదయం 10.00 గంటలకు నెల్లూరు, రామ్మూర్తినగర్
3వ వీధిలోని మా స్వగృహమునందు జరుగును.

## అభివృద్ధి పేరుతో..
# ప్రజలను మభ్యపెడుతున్న వైకాపా
### మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం




సంపద సృష్టించి సమాజాన్ని అభివృద్ధి చేయకుండా, ప్రజలకు నేరుగా డబ్బులు పంపిణీ చేయడమే అభివృద్ధి అన్నట్లుగా ప్రభుత్వం ప్రజలను నమ్మిస్తోందని, అయితే అది నిజమైన అభివృద్ధి కాదని శాసనమండలి మాజీ సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈనెల 4న నెల్లూరు టౌన్‌హాలులో 'ఓటు వేద్దాం..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి కళాజాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, అన్నిరంగాల్లో అభివృద్ధికి బాటలు వేయడం వంటి పనులు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఆయన విమర్శించారు. ఓటు అమూల్యమైనదని, దానిని యువత సద్వినియోగం చేసుకోవాలని, పోలింగ్ శాతం పెరిగినప్పుడు ప్రజాప్రభుత్వానికి పట్టం కట్టే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉంచవద్దని ఎన్నికల సంఘం ఆదేశించినా, వలంటీర్లే మా సైన్యం అంటూ ముఖ్యమంత్రి జగన్ ధిక్కరిస్తుండడం విచారకరమని విమర్శించారు. సేవ్ డెమోక్రసీ అధ్యక్షుడు కోడూరు రవీంద్రరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు జి.మాల్యాద్రి తదితరులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రలోభాలకు గురికాకుండా ఓట్లు వేయాలని, నిరంతర జాగృతే ప్రజలకు శ్రీరామరక్ష అని చెప్పారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా



రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని సర్వేపల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూల చంద్రశేఖర్ చెప్పారు. ఈనెల 3న తోటపల్లిగూడూరు మండలం సాలిపేటలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల్లో గెలిస్తే, కాంగ్రెస్ ప్రజల కోసం చేపట్టనున్న పథకాలను, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అంశాలను వివరించారు. ఆ మేరకు కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పల మస్తానయ్య గౌడ్, నాయకులు సుబ్రహ్మణ్యం, శీనయ్య పాల్గొన్నారు.

## కావలి మహిళానేత..
# అలేఖ్యకు పదవి



ఆర్యవైశ్య నేత, కావలి మున్సిపల్ మాజీ ఛైర్మన్, దివంగత గ్రంధి యానాది శెట్టి కుమార్తె పోతుగంటి అలేఖ్యను తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఈనెల 4న ఆదేశాలిచ్చారు. అలేఖ్య గత టీడీపీ ప్రభుత్వంలో కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. ఆమె నియామకంతో పార్టీ నాయకులు, అభిమానులు ఆమెను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పాతపెన్షన్ ఇచ్చేవారికే..మద్దతు
### యుటిఎఫ్ నాయకుల స్పష్టీకరణ



ఉపాధ్యాయులకు ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తారో వారికే తమ మద్దతంటూ ఆత్మకూరులోని యుటిఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నాయకులు టీడీపీ, జనసేన నాయకులకు స్పష్టం చేశారు. ఈనెల 3న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, శివప్రసాద్‌రావుల ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు టీడీపీ నాయకులను, పలు రాజకీయపార్టీల వారిని కలసి ఆమేరకు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఆత్మకూరు శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహన్‌రావు, షేక్ ఖాదర్‌బాషా, గౌరవాధ్యక్షులు హరికృష్ణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో..
# టీడీపీలోకి భారీ చేరికలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల పంచాయితీ తూర్పు దళితవాడ నుంచి పల్లా సతీష్ నాయకత్వంలో నాటకరాని వీర ప్రసాద్ అధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సమక్షంలో ఇటీవల వైకాపా నుండి 50 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. వైకాపా ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలు, దళితుల మీద సాగుతున్న దాడులు చూసి వైకాపాను వదిలి, టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ దినేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. తెలుగుదేశంపార్టీలో చేరినవారికి తమ అధినేత చంద్రబాబునాయుడు నాయకత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని దినేష్‌రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# నెల్లూరుకు టీడీపీ-జనసేన ప్రచార రథాలు



రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన పార్టీల కూటమి విజయమే లక్ష్యంగా ప్రవాసభారతీయుడు (ఎన్ఆర్ఐ) కొట్టే ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రచార రథాల యాత్ర ఈనెల 3న నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ రథాలకు టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో, శ్రీ సత్యసాయి విద్యాసంస్థల అధినేత చామకూరు హరిగోపాల్ సారధ్యంలో టీడీపీ-జనసేన నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి పొంగూరు నారాయణ విజయం కోసం 3వ డివిజన్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అజీజ్ మాట్లాడుతూ, టీడీపీ విజయానికి అందరూ కృషిచేయాలన్నారు. నెల్లూరు నగరంలో నారాయణ గెలుపు తథ్యమన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు రవికుమార్, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**శ్రీ కాకాణి శ్రీనివాసులరెడ్డి గారు**

పార్టనర్: శ్రీ తిరుమల మెటల్ ఇండస్ట్రీస్, పెంచల లక్ష్మీనరసింహ లారీ సర్వీస్

జననం : 23.05.1948 నిర్యాణం : 04.03.2024

# శ్రద్ధాంజలి

మాకు స్ఫూర్తిప్రదాత, నిత్యం మా అభివృద్ధి కోసం తపించిన మా పెద్దదిక్కు

## శ్రీ కాకాణి శ్రీనివాసులరెడ్డి గారు

మార్చి 4వ తేదీ సోమవారం పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మకి శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**కాకాణి సులోచన** - భార్య

కుమారుడు - కోడలు

**కాకాణి బలరామ్‌రెడ్డి - జీవని**

కుమార్తె - అల్లుడు

**కోడంబాకం ప్రసన్నలక్ష్మి - లీలామోహన్‌రెడ్డి**

మనుమళ్ళు - **కాకాణి దుర్గఅభిమన్యురెడ్డి**

**కాకాణి పృథ్విసింహారెడ్డి**

మనుమరాలు - **కోడంబాకం హర్షిత**

చెల్లెలు - **ఆరగుంట కృష్ణవేణి**

తమ్ముళ్ళు - **కాకాణి వెంకటనారాయణరెడ్డి**

**కాకాణి విజయభాస్కర్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు:** వారి 'పెద్దకర్మ' మార్చి 14వ తేదీ ఉదయం 11.00 గంటలకు హైదరాబాదు, రాజేంద్రనగర్, కాళీమందిర్ దగ్గరలోని పీరంచెరువు సమీపంలో గల గిరిధారి ఎగ్జిక్యూటివ్ పార్క్ 'లాన్స్'లో జరుగును. కావున బంధుమిత్రులకు తెలియచేయడమైనది.



## నెల్లూరు పార్లమెంటు బరిలో..

# వీపీఆర్ – వీఎస్ఆర్

## ఒకరు ప్రజా సేవకుడు... మరొకరు పార్టీ నాయకుడు



మరో వారంలోగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని వార్తలు వస్తున్న తరుణంలో నెల్లూరుజిల్లా రాజకీయ వాతావరణం వేసవికంటే తీవ్రంగా వేడెక్కిపోతోంది. ముఖ్యంగా రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తెలుగుదేశంలో చేరడం, ప్రభాకరరెడ్డిపై పోటీకి వైసీపీ అధిష్టానం మరో రాజ్యసభ సభ్యులు నెల్లూరీయులు వేణుంబాక విజయసాయిరెడ్డిని రంగంలో దింపడంతో రాజకీయాలు జోరందుకున్నాయి.

## చంద్రబాబునాయుడి సమక్షంలో టీడీపీలో చేరిన వీపీఆర్ దంపతులు




మార్చి 2వ తేదీ నాడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుకి వచ్చారు. గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ బాబు రాక... వేమిరెడ్డి దంపతులు చేరిక కోసం ముస్తాబైంది. జాతీయ రహదారి నుండి కార్యక్రమ ప్రాంగణం వరకు పసుపు జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్లతో తెలుగుతమ్ముళ్ళు నింపేశారు. సభా వేదిక దగ్గర నుండి కనుపర్తిపాడు కూడలి వరకు మైకులు ఏర్పాటు చేశారు. చంద్రబాబు సమక్షంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి , ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి పచ్చ కండువాలు కప్పుకున్నారు. ఇది ఎవరూ ఊహించని పరిణామం. తాము తెలుగు దేశం పార్టీలో చేరుతామని బహుశా ఆ దంపతులు కూడా ఊహించి ఉండరేమో. అంతా దైవ నిర్ణయంలా జరిగిపోయిందని వీపీఆర్ అనుయాయులు భావిస్తున్నారు.

## సేవకి చిరునామా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

గత ముప్పై సంవత్సరాలుగా నెల్లూరు జిల్లా సేవారంగంలో తన ఉనికిని చాటుతున్న సేవాభూషణుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి. జిల్లాలో ఆయన సాయం అందుకోని అనాధ ఆశ్రమం లేదు. ప్రభుత్వ పాఠశాలలో వసతులు సమకూర్చారు. ప్రభుత్వ బీసీ హాస్టళ్ళ భవనాల పునఃనిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఖైదీలకు అవసరమైన సౌకర్యాలని ఏర్పాటు చేశారు. జిల్లాలో క్రీడలని ప్రోత్సహించారు. పేదపిల్లలకి కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా అత్యాధునిక వసతులతో స్కూలు భవనాన్ని నిర్మించారు. వీపీఆర్ విద్య పేరుతో పేదవారికి పూర్తిగా ఉచితంగా విద్యాబోధన చేయిస్తున్నారు. విద్యతో పాటుగా వారికి మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, స్కూలు బ్యాగు, షూస్, రవాణా సదుపాయం వంటి వాటి కోసం కూడా వారి వద్దనుండి ఒక్క పైసా ఆశించకుండా మొత్తం

10లో

## వైసీపీ పార్లమెంటు అభ్యర్థిగా నెల్లూరొచ్చిన విజయసాయిరెడ్డి



వైసీపీ అధిష్టానం నెల్లూరు పార్లమెంటు సీటుపై కసరత్తు చేసింది. వీపీఆర్ని ఢీ కొనగల సత్తా, సమర్ధత ఎవరికుందని మల్లగుల్లాలు పడింది. చివరికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని రంగంలో దింపింది. మార్చి 6వ తేదీన విజయసాయిరెడ్డి నెల్లూరుకి వచ్చారు. వైసీపీ శ్రేణులు కూడా తామేం తక్కువ తిన్నామా అన్నంత రీతిలో సాయిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. వందల వాహనాలతో ప్రదర్శన నిర్వహించారు. నగరాన్ని ఫ్లెక్సీలతో, వైసీపీ జెండాలతో నింపేశారు. భారీ నుండి అతి భారీ పూలమాలలతో విజయసాయిరెడ్డిని సత్కరించారు. రామమూర్తినగర్లో తన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సాయిరెడ్డి విలేఖరులతో మాట్లాడారు. తన జన్మభూమి ఋణం తీర్చుకోవడానికి నెల్లూరు నుండి పోటీ చేస్తున్నానని ప్రకటించారు.




ప్రథమ వర్ధంతి

మమతానురాగాల దీప్తి, అమృతమూర్తి, మా అమ్మ

శ్రీమతి ముంగమూరు ఇందిరమ్మ గారి

(స్వర్గీయ ముంగమూరు వెంకట శివరామిరెడ్డి గారి సతీమణి)

ప్రథమ వర్ధంతి సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కుమారులు - కోడళ్ళు

ముంగమూరు జగన్మోహన్‌రెడ్డి - సుమన

ముంగమూరు సుకేష్‌రెడ్డి - మాలిని

మనుమలు

ముంగమూరు రామ్‌కౌశిక్ - సాయి శ్రేయ

ముంగమూరు శంతన్‌రెడ్డి

ముంగమూరు సాయి సర్వేష్

మనుమరాలు

నర్రెడ్డి హిమజ - అనురాగ్‌రెడ్డి

మరియు

ముంగమూరు కుటుంబసభ్యులు

నిర్యాణం : 18.02.2023

వారి ప్రథమ వర్ధంతి : తేది. 09.03.2024 శనివారం ఉ॥10.00 గం.లకు నెల్లూరుజిల్లా, ఏ.ఎస్.పేట మండలం, రాజవోలులోని మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
మార్చి 08, 2024

# మాటలకే పరిమితమైన.. మహిళా సాధికారత

మనదేశంలో మాటలు గొప్పగా.. ఆచరణ చప్పగా ఉండే అంశాల్లో ప్రధానమైనదేమైనా ఉందంటే అది మహిళా సాధికారతే. ఎక్కడ చూసినా మహిళలపై అఘాయిత్యాలు, అకృత్యాలు, లైంగిక వేధింపులు, వరకట్నపు చావులు, గృహ హింసలు నిత్యకృత్యమైపోయిన నేటికాలంలో, మహిళలకు సాధికారత, సమానత్వం వంటివన్నీ మాటలకే పరిమితమై పోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచిపోతున్నా స్త్రీకి మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. అంతేకాదు, మహిళలకు రక్షణ ఉండడం లేదు.. భద్రత అసలే లేదు. సమాజంలో నానాటికీ పురుషాధిక్యత, లింగ వివక్ష, అసమానతలు, అంతరాలు పెరిగిపోతున్నాయే తప్ప తరగడం లేదు. తరాలు మారిపోతున్నా మహిళల తలరాతలు మాత్రం మారడం లేదు. దీంతో, ఏళ్ళతరబడిగా స్త్రీ అన్నిరకాలుగా అణచివేతకు గురవుతూనే ఉంది. నాయకుల మాటల్లోనే సాధికారత.. ఆచరణలో మాత్రం వివక్షతే కనిపిస్తోంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఎంతకాలానికి పూర్తిస్థాయిలో ఫలింపుకు వస్తుందో తెలియదు. హక్కులు బాధ్యతల్లో స్త్రీ పురుషులిరు వురికీ సమభావన ఉండాలని రాజ్యాంగం నిర్దేశించినా ఆచర ణకు వచ్చేసరికి అన్నింటా పెత్తనం పురుషులదే అయిపో తోంది. ఒకవైపు కుటుంబవ్యవస్థలోనూ కూపస్థమండూకంలా మహిళ అనాదిగా అష్టకష్టాలు పడుతూనే ఉంది. ఎక్కడా స్వేచ్ఛ అన్న మాటే లేదు. కూతురుగా, భార్యగా, తల్లిగా కుటుం బాల్లో ఆమే కీలకపాత్ర. అయినా నిత్యం వేదనలు..రోదనలే. అటు కుటుంబవృద్ధికి, ఇటు దేశపురోభివృద్ధికీ ఆమే ఆలంబన. అయినప్పటికీ, ఆమెకు మాత్రం అడుగడుగునా అన్నీ అవరో ధాలే. లింగ వివక్ష వల్ల దేశపురోభివృద్ధికి ఆటంకం కలుగుతుం దని విజ్ఞులు చెప్తూనే ఉన్నా వినిపించుకునే నాథులు లేరు. సాధికారత గురించి ఎవరెన్ని గొప్పలు చెప్పుకుంటున్నా దేశంలో అత్యధికశాతం మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. స్వేచ్ఛ లేదు..సమానత్వం లేదు. సాధికారత అసలే లేదు. మహిళల జీవన ప్రమాణాల్లో ఏళ్లతరబడిగా ఆశించినస్థాయిలో అభివృద్ధి ఉండడం లేదు. మహిళాభ్యుదయం అంటారే కానీ, కాగితాల్లో అటకెక్కివున్న ప్రగతి ప్రతిపాదనలు మాత్రం కిందికి దిగడం లేదు. శాసనాలు చేసేవాళ్ళు కూడా పురుషాధిక్యత ప్రదర్శి స్తుంటే ఇక మహిళల గోడు వినేదెవరు.. వాళ్ళ కన్నీళ్ళు తుడిచే దెవ్వరు?.. బాల్యం నుంచీ కాదు..బాలికలుగా పుట్టినప్పటి నుంచీ అతివలకు అన్నీ కష్టాలే. ఆడబిడ్డలంటే తల్లితండ్రుల పెంపకంలోనూ వివక్షే. పెరిగి పెద్దయ్యాక కూడా మనశ్శాంతి ఉండదు. ప్రేమ పేరుతో, పెళ్లి పేరుతో మహిళల పట్ల సమా జంలో సాగే మోసాలకు, నేరాలకు, ఘోరాలకు అంతే ఉండడం లేదు. వాటికి తోడు పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వంటి దురవస్థలతో మహిళాలోకం నేటికీ అంధకారంలోనే అలమటిస్తోంది. ఇకనైనా ఈ దురవస్థలనుంచి దేశం బయటపడాలి. దేశపురోగతికి మహిళలే మూలస్తంభమని గుర్తించాలి. పాలకులు, నాయకులు డాంబికాలకు పోకుండా, చిత్తశుద్ధితో మహిళలకు నిజమైన సాధికారతను కల్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలి. దేశ జనాభాల్లో దాదాపు సగభాగం పైగానే ఉన్న మహిళాశక్తిని సద్వినియోగం చేసుకో గలిగితే దేశం మరింత పురోగతి సాధిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అటు వ్యవసాయం, ఇటు అసంఘటిత రంగాల్లో అపారంగా ఉన్న స్త్రీశక్తిని దీక్షిగా మలుచుకోగలిగితే దేశానికిక తిరుగే ఉండదు. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించి నూతన పథకాలకు శ్రీకారం చుట్టాలి. దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగంలోనూ కీలకపాత్ర మహిళలదే. పరిశ్రమల రంగంలోనూ, అసంఘటిత రంగంలోనూ మహిళలు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. అయినా, వారి జీవితాలు మాత్రం అధోగతిలోనే ఉంటున్నాయి. దేశప్రజల్లో అత్యధికశాతం మంది మహిళలు వ్యవసాయం, పరిశ్రమలు, అసంఘటితరంగాల్లో ఉన్నారు. వారికి అవసరమైన ఉత్సాహ ప్రోత్సాహాలనందించి, ఆ మహిళాశక్తిని సాధికారత వైపు నడిపించగలిగితే దేశ ఆర్థికవృద్ధికి ఎంతో ఊతమిచ్చినట్లవు తుందనే నిపుణులు సూచనలను పాలకులు పట్టించుకోవాలి. కేంద్రప్రభుత్వంతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు మేల్కోవాలి. అన్నిరంగాల్లోని మహిళాశక్తిని మరిం తగా ప్రోత్సహించేందుకు ఎక్కడికక్కడ మహిళాభివృద్ధి సం ఘాలు ఏర్పాటుచేసి ప్రోత్సాహకాలనివ్వాలి. ఆర్థిక పరిపుష్టత లేకుంటే ఇక సాధికారత ఎక్కడుంటుంది?..మహిళాభ్యున్నతి విషయంలో ఉత్తుత్తి మాటలు కాక, ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలతోపాటు సమాజంలోని ప్రతిఒక్కరూ నిండుమన సుతో కృషిచేసినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. అప్పుడే మహిళా దినోత్సవాలకు సార్థకత చేకూరుతుంది.

......... (మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం)




# ఎన్నికల కాలం వచ్చేసింది..తస్మాత్ జాగ్రత్త!

అదిగో ఇదిగో అనుకుంటున్న ఎన్నికలు అత్యంత దగ్గరకు రానే వచ్చేశాయి. అందులోనూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎన్నికల వేడి పెరుగుతూ వుంది. ఎక్కడబట్టినా ఇవే చర్చలు..అవే రచ్చలు. ఇప్పటికే గత కొద్ది నెలలుగా రాజకీయ నాయకులు అనేకప్రాంతాల్లో ముమ్మర ప్రచారాల్లో ఉన్నారు. సీట్ల సర్దుబాట్లు, పొత్తులు, ప్రచారార్భాటాల్లో నేతలు తలమునకలై ఉన్నారు. ప్రధాన పార్టీల లీడర్లు ఈసారి తప్పకుండా తామే గెలుస్తామనే ధీమాతో ప్రచారాలను పరుగులు తీయిస్తున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు వందల స్థానాలకు పైగానే గెలుచుకుంటామంటూ అధికారపక్షమైన బీజేపీ ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. అందుకు తగ్గట్టుగా ఆ పార్టీ జగజ్జెట్టీలు వ్యూహరచన చేస్తున్నారు. ప్రజల మద్దతు ఈసారి తమకే ఉంటుందని కాంగ్రెస్ నేతలతో పాటు ఇండియా కూటమి పక్షాలు భావిస్తూ, పార్టీ గెలుపుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. గెలుపు గుర్రాల కోసం అన్ని పార్టీల వారూ రాత్రీపగలూ మల్లగుల్లాలు పడుతూనే ఉన్నారు. ఎన్నికల్లో విజయం సాధించాలన్న లక్ష్యంగా ఎవరి వ్యూహాలు వాళ్ళవి. ఎవరి రాజకీయం వారిది. మన రాష్ట్రంలోనూ అదే పరిస్థితి.

## చిత్రవిచిత్ర జోస్యాలు.. రకరకాల సర్వేలు

ఎన్నికలొస్తే చాలు వాళ్లే గెలుస్తారు - వీళ్లే మంత్రులు..సీఎంలవుతారంటూ చిత్రవిచిత్రంగా జోస్యాలు చెప్పేవాళ్ళు, జనంలో సర్వేలు చేశాం..జనమంతా ఫలానా పార్టీవైపే ఉన్నారంటూ చెప్పుకునే రాజకీయ 'సర్వే'యర్లు జనాన్ని అయోమయంలో పడేస్తుంటారు. ఇలాంటివన్నీ ప్రతి ఎన్నికల్లోనూ మనం చూస్తున్నవే. అలాంటి వాటిపట్ల కూడా అప్రమత్తత అవసరం. అన్ని పార్టీల అభ్యర్థులు ఈ దశలో లేనిపోని 'ఉచిత' హామీలు ఇచ్చేసి ఓట్లు రాబట్టుకోవా లని కూడా చూస్తుంటారు. ప్రత్యర్థులపై అసత్యాలను కూడా ప్రచారం చేసేస్తుంటారు. ఏది ఎంతవరకు నిజమో ఓటర్లే విజ్ఞతతో తెలుసుకోవాలి. 'నిజం'..ఇంటినుంచి బయలుదేరబోయేసరికి, 'అబద్ధం' ఊరంతా చుట్టి వచ్చేస్తుందని నానుడికి తగ్గట్టుగా, ఎన్నికల్లో గెలుపుకోసం అవతలివారిపై లేనిపోని దుష్ప్రచారాలు చేయడం, వ్యక్తిగత నిందలు కూడా వేసి వేదిస్తుండడం మామూలైపో యింది. ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయాలు వారు చెప్పుకోవడానికి స్వేచ్ఛ ఉన్నా, ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకూడదని, అవతలివాళ్ళ పట్ల అనుచితంగా, లేదా అమర్యాదగా ప్రవర్తించకూడదని, ఎదుటివారి గురించి మాట్లాడే భాష కూడా గౌరవంగా ఉండాలని విజ్ఞులెంతగా చెప్తున్నా వినేవారు లేరు. సహేతుకమైన విమర్శలను కూడా తట్టుకోలేకపోవడం, నోటికొచ్చిన బూతులన్నీ మాట్లాడడం, చొక్కాలు మడతేసి చంపేస్తాం-నరికేస్తాం అంటూ భయపెట్టేవిధంగా హుంకరి స్తుండడం వంటివి కూడా రాజకీయరంగంలో ఈ మధ్యకాలంలో బాగా ఎక్కువైపోయాయి. ఎవరో కొంతమంది మంచి వారు ఉండొచ్చుగాక, అధికశాతం నాయకుల్లో నీతి నిజాయితీలు, నైతిక విలువలు మచ్చుకి కూడా కనిపించకపోవడం విచారకరం. అహంకారం, అరాచకత్వం పెరిగి పోయింది. అందుకే మంచివారిని ఎన్నుకోవాలి.

## మంచి నేతలతోనే మంచి సమాజం

అవినీతి అక్రమాలతో కోట్లు గడించి, నేరస్తులుగా ముద్రపడిన వారు, రౌడీలు, గూండాలు కూడా రాజకీయాల్లోకి చొరబడిపోయి ప్రజలను శాసిస్తున్న దౌర్భాగ్యకాలం ఇది. ఎన్నికలొస్తే చాలు..నేరచరితులు వీరంగం చేస్తుంటారు. దౌర్జన్యాలు, అరాచకాలతో ఓట్లు వేయించుకోవాలనుకుని చూస్తుంటారు. అమాయక జనానికి మందుపోయించో, డబ్బులిచ్చో.. ఎలా గోలా బుట్టలో వేసుకోవాలనుకునేవారి పట్ల ప్రజలు ఇంకా జాగ్రత్తగా ఉం డాలి. కులం పేరుతో, మతం పేరుతో, భాష పేరుతో ఓట్లు అడగకూడదని, వాస్తవాలకు విరుద్ధంగా ఎలాంటి ప్రకటనలు చేయవద్దని, ఓటర్లను తప్పుదోవ పట్టించకూడదని, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రత్యర్థులను కించపరిచేలా పోస్టులు పెట్టకూడదని, మహిళల గౌరవానికి-పరువుకు భంగం కలిగించే హేయమైన వ్యాఖ్యలు, చర్యలు చేయరాదని ఎన్నికల కమిషన్ పదేపదే సూచిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ధనబలం, కండబలం ఉన్నవారిదే రాజ్యమైపోయిన నేటికాలంలో.. అందులోనూ ఈ ఎన్నికల రోజుల్లో ఓటర్లు అన్నివేళలా అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి. అలాంటి అరాచకీయులకు, అరాచకీయాలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాల్సిన సరైన సమయం కూడా ఇదే. మంచి నాయకులను గెలిపించుకుంటే మంచి సమాజం వస్తుందని గుర్తుంచుకోవాలి. ప్రపంచంలోనే అత్యధికంగా మనదేశంలో సుమారు 97 కోట్లకు పైగానే ఓటర్లుండడం ప్రజాస్వామ్యానికి పెద్ద ఆలంబన. ప్రజాస్వామ్య సాధనకి ఓటర్లే పునాది. అందుకే ఓటు హక్కు ఎంతో పవిత్ర మైనది, ఎంతో విలువైనది కూడా. అయితే, ఆ ఓట్లను కూడా జాబితాల్లోంచి మాయం చేసి, దొంగ ఓట్లతోనో, లేదా రిగ్గింగులతోనో గెలవాలని చూసే అరాచక నాయకులు కూడా లేకపోలేదు. అందుకే మన ఓట్లు అసలు జాబితాలో ఉన్నాయో లేవో వెంటనే సరిచూసుకోవాలి. ఓటే వజ్రాయుధం. ఎలాంటి ఆశలకు, తాయిలాలకు, ప్రలోభాలకు, భయాలకు లొంగ కుండా విజ్ఞతతో ఆలోచించి, ఓటును సద్వినియోగం చేసుకునే కర్తవ్యాన్ని మాత్రం ఎవరూ విస్మరించకూడదు.

- రాజశ్రీ

# బుచ్చికి బైపాస్ లేదా వంతెన కావాలి!

నెల్లూరుజిల్లాలో బుచ్చిరెడ్డిపాళెం అంటే పెద్ద రెడ్లకి కొలువని పేరు. బెజవాడ గోపాలరెడ్డి పుణ్యమా అంటూ నెల్లూరు నుండి బుచ్చికి అరవైఏళ్ళ నాడే సిమెంటు రోడ్డు ఏర్పడింది. నెల్లూరు నుండి ముంబైకి వెళ్ళే జాతీయ రహదారి బుచ్చి మీదుగానే వెళ్తుంది. నెల్లూరు నుండి బద్వేలు, మైదుకూరు మీదుగా కడప, కర్నూలు, అనంతపురం వెళ్లే వాహనాలన్నిటికీ ప్రధాన రహదారి ఇదే. రోజూ కొన్ని వందల వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. వాటితో పాటు జిల్లా సరిహద్దు వరకూ ఉన్న మండలాలు, గ్రామాలకి కూడా బస్సులు, ఆటోలు, ఇతర రవాణా వాహనాలు రాకపోకలు సాగిస్తుం టాయి. ఇంత రద్దీ ఉన్న రహదారిలో వాహనాలన్నీ తప్పనిసరిగా బుచ్చిరెడ్డిపాళెం ఊరు మధ్యలోనుండే వెళ్ళాలి. నెల్లూరు నుండి జిల్లా సరిహద్దు వరకూ రహదారిని విస్తరించి టోలు కూడా వసూలు చేస్తున్నారు. అయితే, బుచ్చిరెడ్డిపాళెం వద్దకి వచ్చేసరికి వాహనాల స్పీడుకి బ్రేకులు పడిపోతున్నాయి. బుచ్చికి బైపాస్ నిర్మించాలంటే భూ సేకరణకు భారీ మొత్తంలో నిధులు వెచ్చించాలి కాబట్టి అది అసాధ్యం అంటున్నారు అధికారులు. కనీసం బుచ్చి ఊరు మొదలు నుండి చివరివరకు వంతెనైనా (ఫ్లై ఓవర్) నిర్మించేలా ప్రభుత్వం, నాయకులూ చర్యలు చేపట్టి, ఆ మార్గాన ప్రయాణించే వాహన దారుల కష్టాలు తీర్చాలని నా మనవి.

- ఆర్.కోదండరామిరెడ్డి, సంగం.

# అవును... ఆ బూతులు వినలేక చస్తున్నాం!

గత వారం మన 'లాయర్'లో "సత్యపీఠం"లో రాసిన రాజకీయ నాయకుల బూతుల భాగోతం చక్కగా ఉంది. అవును, నిజమే... ఈ రాజకీయ ప్రబుద్ధుల బూతుల పురాణం వినలేక చస్తున్నాం. మొన్నటికి మొన్న, సచివాలయం తాకట్టుపై మాజీ మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ "సెక్రటేరియట్ చంద్రబాబుగాడి అమ్మ మొగుడిదా" అంటూ మాట్లాడాడు. ఆయన నోటికి మరీ అడ్డు అదుపు ఉండనే ఉండదు. ఇలాంటి లేకి మనుషులు మన రాజకీయ నేతలు అని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సి వస్తుంది. సామాజిక మీడియాలలో వస్తున్న బూతుల పంచాంగం గురించి సత్యం పలికింది మన 'లాయర్'.

కే.వీ.కుమార్, బాలాజీనగర్, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# రోత పుట్టిస్తున్న అనధికార సైరన్ల మోత

నెల్లూరు నగరంలో అనధికార వాహ నాల సైరన్లు మోత రోత పుట్టిస్తున్నాయి. ఎలాంటి అధికార అర్హత లేకుండానే కొంత మంది ప్రైవేట్ వాహనదారులు తమ వాహనాలకు సైరన్లు బిగించుకుని ట్రాఫిక్ సమయాలలో వాటిని ఉపయోగిస్తున్నారు. సహజంగా పోలీసు, అంబులెన్సులు, ఫైరింజన్లు వంటి అత్యవసర సేవల వాహ నాలు మాత్రమే ఈ సైరన్లని ఉపయోగిం చాలి. అలా కాకుండా కొంతమంది ప్రజా ప్రతినిధుల అనుచర గణం, పోలీసుశాఖ కుటుంబసభ్యులు తమ ఇష్టానుసారం సైరన్లని బిగించుకుని మోత మోగిస్తున్నారు. ఎస్.పి. గారు దృష్టిపెట్టి ఇలాంటి వాహనా లని అదుపు చేయాలని కోరుతున్నాను.

ఆర్.పి.రామయ్య,
కొండాయపాలెం, నెల్లూరు.

# అద్భుతం.. సినారా 'అక్షరోత్సవం'

**కవుల కవితాగానాలు, పాటలు-గేయాలతో.. అపురూపమైన సాహిత్య ప్రసంగాలతో ప్రముఖ కవి చిన్ని నారాయణరావు (సినారా) సారథ్యంలో జరిగిన 'అక్షరోత్సవం' అందరినీ ఆకట్టుకుంది. సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ, మానవీయతను ఉద్దీపనగావిస్తూ కవులు, కవయిత్రులు తమవంతు అక్షరసేద్యం చేయాలని ఈ సందర్భంగా సాహితీవేత్తలు వర్ధమాన కవులకు ఉద్బోధించారు. సాహిత్యంలో ఆ రచనలకు శాశ్వతత్వం ఉండదని, సాహితీకారులు సృజనకు పెద్దపీట వేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డా. నందమూరి లక్ష్మీపార్వతి సూచించారు. తెలుగుభాష ఏనాటికీ మృతభాష కాదని, అది అమృతభాష అనీ భరోసా ఇచ్చారు. 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జయప్రదంగా జరిగిన ఈ సభ సాహిత్యాభిమానులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.**



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, 'మాట' దీర్ఘకవితాకర్త చిన్ని నారాయణ రావు తన పేరుతో మార్చి 3 ఆదివారం రోజున 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' ఏర్పాటుచేసి, తొలి కవితోత్స



వాన్ని 'అక్షరోత్సవం'గా నామకరణం చేసి అత్యద్భుతంగా నిర్వహించారు. టౌన్‌హాలు లోని ఏసీహాల్‌లో జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డా. నందమూరి లక్ష్మీపార్వతి ప్రసంగం ఆద్యంతం కవితాఝురిలా సాగింది. ఏ కవిత్వానికైనా సృజనతో పాటు సరళత ఉండాలి, కవిత్వంలో భావ గాంభీర్యత, నిగూఢత ఉండాలని, అలాంటి కవిత్వమే శాశ్వతంగా నిలిచివుంటుందని ఆమె చెప్పారు. 'ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్'గా ప్రఖ్యాతిచెందిన తెలుగుభాష అజంతా భాష అనీ అన్నారు. తెలుగుభాష అంత రించిపోతుందని అనేకమంది విమర్శలు చేస్తుంటారని, అయితే ఇతర భాషల్లోని మాటలను సైతం తనలో ఇముడ్చుకుని మరింత పరిపుష్టత చెందుతుందే తప్ప ఏనాటికీ తెలుగుభాష మృతభాష కాబోదని, ఇది అమృతభాష అనీ అన్నారు. మహాకవి తిక్కన పుట్టిన ఈ గడ్డలో ఎందరో రసజ్ఞు లైన సాహితీమూర్తులు ఉద్భవించారని ఆమె అంటూ, చిన్ని నారాయణరావు లాంటి కవులు-కవితపోషకులు ఉంటే ఎందరో కవులకు ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే రాజులని, కవితాపోషకులైన చిన్ని నారా యణరావుకు 'కవి రాజు' అని బిరుదివ్వ వచ్చునంటూ ఆమె నారాయణరావు సాహితీసేవలను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన 'లాయర్' సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) మాట్లా డుతూ, చిన్ని నారాయణరావు గతంలో 'లాయర్' పత్రికకు సినిమా సమీక్షలు రాశారని, అవి తమకు స్ఫూర్తిగా నిలిచా యని చెప్పారు. నారాయణరావు రాసిన 'బతుకొక ఉత్సవం' కవితా సంపుటిని 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు..తమ నాన్నగారైన తుంగా రాజగోపాల్‌రెడ్డికి అంకితమిచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకుంటూ, తానొక కవిగా కవితా రంగంలో కలంపట్టి కవిత్వం రాస్తూనే కవులకు.. కవయిత్రులకు తనవంతు ప్రోత్సాహాన్ని అందించాలనే ఉత్సాహంతో ఈ ఫౌండేషన్‌ను నెలకొల్పడం నారాయణ రావు కవిత్వాభిమానానికి నిదర్శనమ న్నారు. ఈ ఫౌండేషన్ జయప్రదంగా మరింత పెద్దస్థాయిలో కొనసాగాలని ప్రభు ఆకాంక్షించారు. మనిషి మనిషిగా మాన



వత్వంతో మనుగడ సాగించాలని, అప్పుడే సమాజం బాగుంటుందని, ఆ దిశలో నారా యణరావు రాసిన 'బతుకొక ఉత్సవం' కవులకు మార్గదర్శకమని ఈ ఫౌండేషన్ తొలి ప్రధాన అవార్డు గ్రహీత, హైదరా బాద్‌కు చెందిన కవిసంగమ ఉద్యమసారథి యాకూబ్ కొనియాడారు. అనంతరం లక్ష్మీపార్వతి, శివప్రభాత్‌రెడ్డి, నారాయణ రావు చేతుల మీదుగా ఆయన తొలి అవార్డును స్వీకరించారు. అదేవిధంగా చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ప్రముఖ కవి.. శ్రీ కంఠ బంగారాజు, నవమల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ





పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత శ్రీరామకవచం సాగర్, ప్రముఖ కవి బీరం సుందరరావు పాల్గొని చిన్ని నారాయణ రావు కవిత్వాన్ని, ఫౌండేషన్ స్థాపనలోని ఔన్నత్యాన్ని అభినందించారు. తొలుత, వేదికపై ఆశీనురాలైన లక్ష్మీపార్వతిని చిన్ని నారాయణరావు సతీమణి సురేఖ, కోడలు ప్రవల్లిక లక్ష్మీపార్వతిని పూలకిరీటంతో, నూతన వస్త్రాలతో ఘనంగా సన్మా నించారు.

## ఆత్మీయ సత్కారాలు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవులు, కవయిత్రులు ఏటూరి నాగేంద్రరావు, మద్దూరు శ్రీనివాసులు, అవ్వారు శ్రీధర బాబు, నల్లు రమేష్, గోవిందరాజు సుభద్రాదేవి, ఎస్‌వీఎస్ నాగ గాయత్రి, వాయుగుండ్ల శశికళ, ఎస్‌డి నజ్మా, బొగ్గరపు ఇందిరాకృష్ణలకు ఈ సందర్భంగా చిన్ని నారాయణరావు ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఆత్మీయ సత్కారాలు జరిగాయి. కళాంజలి అనంత్, దువ్వూరు బెనర్జీల నిర్వహణలో ఎంతో సందడిగా జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పాల్గొ న్నారు. గోవిందరాజు సుభద్రాదేవి, అవ్వారు శ్రీధరబాబు, తోట సులోచన ఆధ్వర్యంలో తొలుత నిర్వహించిన కవిసమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితలు వినిపించారు.

## ఆకట్టుకున్న ఆపాత మధురగీతాలు

ఈ కార్యక్రమంలో భాగంగా 'పాడుతా తీయగా' గాయని కుమారి ఐవిఎన్ జ్ఞానశ్రీ పాడిన 'సడిచేయకే గాలి', 'ఓహో మేఘమాలా', తెల్లవారవచ్చే తెలియక నా సామి' తదితర ఆపాత మధురగీతాలు అందరి కరతాళ ధ్వనులందుకున్నాయి. అనంతరం జ్ఞానశ్రీని లక్ష్మీపార్వతి ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.




శ్రీమతి అశోక్ శశికళ గారు

జననం : 18.10.1953 నిర్యాణం : 4.3.2024

అశ్రునివాళి

మంచితనం మూర్తీభవించిన మానవతామూర్తి,
ఆప్యాయతానురాగాల అనురాగదీప్తి,
నా శ్రేయోభిలాషి, స్నేహాభిలాషి
**మా శశక్క**
మృతికి చింతిస్తూ, ఆమె ఆత్మకి శాంతి చేకూర్చాలని
దైవాన్ని ప్రార్థిస్తున్నాను.

అశ్రునయనాలతో...

డాక్టర్ రాధామాధవి
శ్రీ సాయిపథం హాస్పిటల్స్
పొగతోట, నెల్లూరు.

# వైకాపా జిల్లా అధ్యక్షునిగా.. పర్వతరెడ్డి



శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరుజిల్లా వైకాపా అధ్యక్షునిగా నియమితులయ్యారు. మొన్నటి దాకా ఈ పదవిలో ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి టీడీపీలో చేరడంతో, ఆ స్థానానికి పర్వతరెడ్డిని ఎంపిక చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# సాయిదర్బార్‌లో.. అగ్నిగుండ మహోత్సవం



నెల్లూరులోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం వద్ద ఉన్న ప్రాంగణంలో ఈనెల 5 నుంచి 6వ తేది రాత్రి వరకు శ్రీసాయినాథ శ్రీ పాండు రంగస్వామి వార్ల అగ్నిగుండ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సుమారు 400 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేయడం విశేషం. వేకువన 4 గంటల నుండి భక్తులందరూ 'ఓం హర నారసింహా', 'రంగా రంగా-పాండురంగా' అంటూ పెద్దపెట్టున చేసిన నామోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సాయిదర్బార్ మందిరం ఛైర్మెన్ మధు సాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య పర్యవేక్షణలో పెద్దఎత్తున ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండరి భజనల గురువు లక్ష్మీ సాయి ఆధ్వర్యంలో దాదాపు 3 వందల మంది భక్తులు కోలాహలంగా భజనలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి 30 మంది పండరి భజన గురువులు వారి శిష్యబృందాలు పాల్గొన్నాయి. గురువులు కొల్లపూడి శీను, తులసిరాం సహకారంతో ఈ కార్యక్రమాలు జయప్రదంగా జరిగాయి.

# కలెక్టరేట్ ఎదుట.. వీఓఏల ఆందోళన



వివోఏల ఉపాధికి నష్ట దాయకమైన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ నెల్లూరు నగరంలోని వెలుగు వీఓఏ ఉద్యోగులు ఈనెల 4న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ వెలుగు వీవోఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ. 10లక్షల గ్రూపు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని, స్వావలంబన నగదును తిరిగి సభ్యులకు చెల్లించాలని, వీఓఏలందరికీ గుర్తింపు కార్డులు, యూనిఫారం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆందోళనలో ఆ సంఘం నాయకురాలు మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# కొత్త జేసీ..బాధ్యతలు చేపట్టారు



నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సేతుమాధవన్ ఈనెల 6న బుధవారం నాడు నెల్లూరులోని కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ మరియు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. కొత్త జేసీ సేతుమాధవన్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందినవారు. ఆయన స్వస్థలం తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి. గతంలో ప్రకాశం జిల్లాలో ట్రైనింగ్ కలెక్టర్‌గా, అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్‌గా కూడా పనిచేశారు. రాష్ట్ర ఎంఎస్.ఎం.ఇ శాఖలో సీఈఓగా పనిచేస్తూ, బదిలీపై నెల్లూరు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చారు.

# పల్స్ పోలియో..జయప్రదం



జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇటీవల మూడురోజుల పాటు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం జయప్రదమైంది. చిన్నారుల్లో పోలియోవ్యాధి రాకుండా ఉండేందుకు పోలియో చుక్కల మందు ఎంతో ఉపయోగపడుతున్న నేపథ్యంలో జిల్లాలో అయిదేళ్ల లోపు పిల్లలకు వాటిని వేసేందుకు సర్వే చేపట్టగా 2,93, 536 మంది పిల్లలు ఉన్నట్లు తేలింది. వీరిలో తొలిరోజు ఈనెల 3న 2,87,724 మందికి, రెండోరోజు ఈనెల 4న 5,336 మందికి, మూడవ రోజు ఈనెల 5న 1485 మంది పిల్లలకు పోలియో డ్రాప్స్ వేశారు. మొత్తంగా లక్ష్యానికి మించి 100.36 శాతం మంది పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయడం విశేషం.

# ఓటుహక్కును వినియోగించుకోవాలి

రానున్న ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కోరారు. ఈనెల 5న ఆయన కోవూరు నియోజకవర్గంలోని దామరమడుగు, పెనుబల్లి గ్రామాల్లో సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను, సాల్మన్ పురంలో నిర్మాణంలో ఉన్న పోలింగ్ ఉన్న కేంద్రాన్ని జిల్లా ఎస్పీతో కలిసి పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ సౌజన్య, డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# 12న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు మార్చి 12వ తేదీన నిర్వహించేందుకు జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమేరకు ఏర్పాట్లపై జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో జడ్పీ సీఈఓ కన్నమనాయుడు చర్చించారు. ఆరోజున మొత్తం 7 కమిటీలకు సంబంధించిన సమీక్షలు జరిపేందుకు వారు సమాయత్తమవుతున్నారు.

# సోమిరెడ్డితో..వేమిరెడ్డి భేటీ



ఇటీవలే టీడీపీలో చేరిన రాజ్యసభ సభ్యులు, సేవా భూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు..మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని, జిల్లా రాజకీయాలపై చర్చించుకున్నారు. అక్కడున్న సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులను కూడా వేమిరెడ్డి పలకరించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని వేదాయపాలెంలో ఉన్న సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయానికి వచ్చిన వేమిరెడ్డిని సోమిరెడ్డి సాదరంగా స్వాగతించారు.

# పటిష్టంగా విద్యా హక్కు చట్టం అమలు

### -- కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదన్‌రావు --



రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదన్‌రావు తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని డిఈఓ కార్యాలయాన్ని సందర్శించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో 50,000 మంది విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అద్మిషన్లపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ, డిప్యూటీ డిఇఓ, ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. మార్చి 5 నుంచి విద్యాహక్కు చట్టానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు సంబంధించిన పత్రాలతో పాటు ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు కూడా జతపరచాలన్నారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25శాతం విద్యాహక్కు చట్టం కింద సీట్లు ఇవ్వాలన్నారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సుందరేశ్వరస్వామికి.. శివరాత్రి ఉత్సవాలు

మహాశివరాత్రి సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ సుందరేశ్వరస్వామి వారికి శివరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆ ఉత్సవాల్లో భాగంగా మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు శ్రీ సుందరేశ్వరస్వామికి విశేష అలంకరణలు, విశిష్ట పూజలు నిర్వహిస్తామన్నారు. మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారికి ఉత్సవవేడుకలు మరింత వైభవంగా ఉంటాయని, ఆరోజు రాత్రి 10 గంటలకు శ్రీ సుందరేశ్వరునికి లింగోద్భవ అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావాలని ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు రత్నం జయరామ్, కార్యనిర్వహణాధికారి జె.వెంకట సుబ్బయ్య విజ్ఞప్తిచేశారు.




### బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో..

# 8న మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో, వివిధ రంగాల్లో ఉత్తమసేవలందిస్తున్న బ్రాహ్మణ మహిళలకు సన్మానాలు నిర్వహిస్తున్నామని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మైలవరపు మురళీమోహన్ ఈనెల 4న ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలతో పాటు, పదవీ విరమణ చేసిన మహిళలు కూడా తమ సేవా కార్యక్రమాల వివరాలను తెలియజేసి సన్మానం అందుకోవచ్చుని, ఆ వివరాలను వేదిక అసోసియేట్ ప్రెసిడెంట్ రఘుకిషోర్ శ్రీకంఠకు తెలపాలని ఆయన కోరారు.

# నగర సమస్యలు తీర్చలేని పాలకులు

### సీపీఎం నాయకుల విమర్శ

నెల్లూరు నగరంలోని ప్రతి డివిజన్‌లో సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, అయినా పాలకులు ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని, సమస్యలు తీరక ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 5న నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటియు జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, చంద్రారెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ సిటీలో అభివృద్ధి పనులకు..

# ఎంపీ ఆదాల శంకుస్థాపన



**• రూ.43 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్‌లో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. ఇస్కాన్ టెంపుల్ సమీపంలో రూ.43 లక్షల నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఆదాలకు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్, రాష్ట్ర వైస్సార్సీపీ సేవాదళ్ సెక్రటరీ, 20వ డివిజన్ ఇన్‌ఛార్జ్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) ఆధ్వర్యంలో స్థానిక వైఎస్‌ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ ప్రాంతంలో ఎంపీ ఆదాల ఆర్‌ఎస్‌ఆర్‌తో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా చేయడమే తన లక్ష్యమని ఆదాల ఈ సందర్భంగా ప్రజలకు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైకాపాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగర మేయర్ పొట్లూరు స్రవంతి, డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ కార్యక్రమాలపై యువతకు అవగాహన



నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించారు. స్థానిక అనిత హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కేంద్ర ప్రభుత్వ క్రీడా మంత్రిత్వ శాఖ మరియు యువజన వ్యవహారాల శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని దేశ మొత్తంమీద అన్ని జిల్లాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నెల్లూరులోనూ యువతకు మాక్ పార్లమెంట్ నిర్వహించి వారికి పార్లమెంట్ కార్యక్రమాల మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. యువత దేశ రాజకీయాల మీద, పార్లమెంట్ వ్యవహారాల మీద కూడా అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఫీల్ట్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి మాట్లాడుతూ, పార్లమెంట్ వ్యవహారాల గురించి, జీరో అవర్ గురించి, అధికార పక్షం- ప్రతిపక్షం కీలక పాత్రల గురించి వివరించారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటప్పయ్య, సర్వ శిక్ష అభియాన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, జిల్లా యువజన అధికారి ఏ.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కార్పొరేషన్ కార్యాలయంలో

# ఎన్నికల కంట్రోల్ రూమ్

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. ఎన్నికల నోడల్ అధికారులు అందరూ కంట్రోల్ రూమ్‌లో విధుల నిర్వహణ కోసం సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించుకుని విధి నిర్వహణ కోసం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇటీవల ఆయన నోడల్ అధికారులతో కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు, సమస్యలు వగైరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సత్వరమే తెలియచేయాలని, అందుకుగాను క్రియాశీలకంగా పనిచేసే సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఎస్. లవన్న, నోడల్ అధికారులు, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డెప్యూటీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్‌ఎంఇ సర్వేను

# విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 20వ తేది వరకు నిర్వహించనున్న ఎంఎస్‌ఎంఇ సర్వేను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన ఆమేరకు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరిచి డేటాబేస్ అభివృద్ధి పరిచేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని, దీని ద్వారా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల శాఖ జి.ఎం. సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలోని 'టిహెచ్‌కె' ప్లాంట్ విస్తరణకు భూమిపూజ

**• రూ. 300 కోట్ల పెట్టుబడితో నిర్మాణపు పనులు ప్రారంభం**



రవాణా వాహనాల సామగ్రి తయారీలో ప్రఖ్యాతి గడించిన జపాన్‌కు చెందిన టిహెచ్‌కె కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ టిహెచ్‌కె ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన ప్లాంట్ విస్తరణకు సిద్ధమైంది. ఈనెల 5న శ్రీసిటీలో టిహెచ్‌కె గ్రూప్ ఛైర్మన్, సీఈఓ అకిహిరో తెరమాచి ఆధ్వర్యంలో నూతన ప్లాంట్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. రూ.300 కోట్లు పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా మరో 250మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. నవంబర్ 2021 నుండి పనిచేస్తున్న శ్రీసిటీలోని ఈ ప్లాంట్‌లో ఇప్పటికే దాదాపు 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎస్‌ఎంసిసి హెచ్‌క్యూ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మిమోరి, ఎం.డి షిమిజు, జనరల్ మేనేజర్ వతనాబే తదితరులు నూతన ప్లాంట్‌కు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకిహిరో తెరామాచి మాట్లాడుతూ, తమ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ విస్తరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కొత్త వర్క్‌షాప్, కేంద్రీకృత డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తిని పెంచడం, కార్యకలాపాలను సులభతరం చేయడం, కస్టమర్‌లకు నాణ్యమైన ఉత్పత్తులను అందచేయడం తమ ప్రణాళికగా పేర్కొన్నారు.

శ్రీసిటీ ప్లాంట్‌కు పలు అదనపు ప్రయోజనాలు ఉన్నాయని, భవిష్యత్తులో యూరోప్, ఆఫ్రికన్ మార్కెట్‌లలో వృద్ధి సాధించే దిశగా టిహెచ్‌కె ఇండియా ప్రయత్నాలు సాగుతున్నాయని అంటూ, అందుకు మరో ముఖ్యమైన మైలురాయిని అధిగమించిన టిహెచ్‌కె బృందాన్ని డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధి, మరింత ఉపాధి కల్పన జరుగనుందంటూ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న వ్యాపార అవకాశాల దృష్ట్యా ఇప్పటికే శ్రీసిటీలోని 20 శాతం తయారీ పరిశ్రమలు తమ ప్లాంట్ల విస్తరణ చేపట్టాయని వెల్లడించారు. ఈ తరహా విస్తరణలు శ్రీసిటీ వ్యాపార అనుకూల పర్యావరణ వ్యవస్థకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు.






# దేవిరెడ్డి శారద హైస్కూల్‌లో..6వ తరగతి ప్రవేశ పరీక్షలు



అల్లూరు మండలం నార్త్ మోపూరు గ్రామంలోని దేవిరెడ్డి శారద హైస్కూల్‌లో ప్రతి సంవత్సరం ఆరవ తరగతిలో ప్రవేశానికి ఐదవ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా రెండు దశల్లో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామని, మొదటి దశ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు, రెండవ దశ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఇటీవల ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల ప్రవేశ పరీక్ష మొదటి దశ ముగిసిందని, మొత్తం 214 మంది ఐదో తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం రెండవ దశ ప్రవేశ పరీక్షను మార్చి 10వ తేదీ ఆదివారంనాడు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.




# సర్వేపల్లిలో.. నిలిచేది మనమే.. గెలిచేది మనమే!

## - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా



రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, సర్వేపల్లిలో కూడా నిలిచేది మనమే..గెలిచేది మనమే నని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరు వేదాయపాళెంలోని తమ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఎన్నికల యుద్ధానికి సంసిద్ధమై పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క పోలింగ్‌బూత్ ఇన్‌చార్జి, యూనిట్, క్లస్టర్, గ్రామ నాయకులతో కలిసి 'బాబు సూపర్-6' పథకాల కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం, తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేయనున్న 'శంఖారావం' సభలను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూచించిన 'సూపర్-6 పథ కాలను' పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ సమావేశంలో యువనాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### అది భూ రక్ష కాదు.. భూ భక్ష పథకం :

వైకాపా ప్రభుత్వం చేపట్టిన భూ రక్ష పథకం కేవలం భూ భక్ష పథకమేనని, భారీ అవకతవకలు అక్రమాలతో అస్తవస్తంగా ఉన్న ఆ పథకాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దుచేసి, సక్రమమైన పథకాలను అమలు చేస్తామని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 3న ఆయన పొదలకూరు మండలంలోని దుగ్గుంట పెద రాజుపాళెం, కొత్త కంబాలపల్లి గ్రామాల్లో పర్యటించి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అమలు చేయనున్న సరికొత్త ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు ఆయనకు, టిడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం కొత్తకంబాలపల్లిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ వారసత్వంగా వచ్చే ఆస్తులపై జగన్ ఫోటో ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, త్వరలో వైకాపాకు చరమగీతం పాడతామన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలోని 10స్థానాలను తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, నాయకులు కోదూరు పెంచలబాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం నాయుడు, చిరుమావిళ్ళ సత్యనారాయణ, యన్ వెంకటేశ్వర్లునాయుడు, ఈతముక్కల బాబునాయుడు, దేవినేని శరత్, వెంకటేశ్వర్లు రాజు పాల్గొన్నారు.

## బుచ్చిలో పొదుపు మహిళల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీ కార్యాలయంలో ఇటీవల పొదుపు మహిళల సమావేశం జరిగింది. బుచ్చి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొని మాట్లాడుతూ, పొదుపు గ్రూపుల వారు క్రమంతప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.



## రాజ్యలక్ష్మిని కలిసిన కడిగుంట్ల గ్రామస్తులు

బాలాయపల్లి మండలంలోని కడిగుంట్ల దళితవాడకు చెందిన గ్రామస్తులు మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మిని వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, గ్రామస్తుల యోగ క్షేమాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేదురుమల్లి కుటుంబ ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఆమె వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం



ఈనెల 4న 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు ఉత్సవాలు శ్రీసిటీలో ఘనంగా జరిగాయి. ఇందులో శ్రీసిటీ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బందితో పాటు సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా భద్రత ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, ఈ జాతీయ భద్రతా దినోత్సవం నాడు, ఈ ప్రాంతంలో భద్రతా సంస్కృతిని పెంపొందించడానికి, ప్రమాదాలకు తావులేకుండా చేయడానికి, రోడ్లు, పని ప్రదేశాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో భద్రత కోసం విస్తృత ప్రచారం చేసేందుకు అందరూ ప్రతిజ్ఞ చేయాలని తన సందేశంలో పిలుపునిచ్చారు.

### అంగరంగ వైభవంగా..

## ఆది దంపతుల బ్రహ్మోత్సవాలు

### - శ్రీకాళహస్తికి వేలాదిగా భక్తజనులు -



దక్షిణ కైలాసంగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తిలో కొలువైవున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలి వచ్చి ఆదిదంపతులైన ఆ పార్వతీపరమేశ్వరులను దర్శించుకుని తరిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు, అధికారుల సారధ్యంలో మార్చి3 నుంచి 16వతేదీ వరకు 13రోజుల పాటు ఈ వేడుకలు జరుగనున్నాయి. మార్చి 3వతేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. కన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 4న శ్రీ స్వామివారి ధ్వజారోహణం, ఉదయం-రాత్రి వెండి అంబారీ వాహనసేవలు నయనానందకరంగా సాగాయి. 5న సూర్యప్రభ-చప్పర వాహనసేవలు, 6న హంస-యాళి వాహన సేవలు, రాత్రికి రావణ-మయూర వాహనసేవలు జరిగాయి. 7న హంస-శుక వాహనసేవలు, రాత్రి శేష-యాళి వాహన సేవలు జరిగాయి. మార్చి 8న శివరాత్రి మహోత్సవం సందర్భంగా స్వామివారికి ఇంద్రవిమానం-చప్పర వాహన సేవలు, రాత్రికి నందివాహనం-సింహవాహన సేవలు కనువిందుగా జరుగనున్నాయి. అదేవిధంగా, 9న ఉదయం 11 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం ఉంటాయి. 10వ తేది ఉదయం అధికార నందివాహన సేవ-కామధేనువు వాహనసేవలు, రాత్రి 9గంటలకు గజ-సింహవాహన సేవలు, 11న రుద్రాక్ష అంబారీ వాహన సేవ, రాత్రి 7గంటలకు శ్రీ సభాపతి కల్యాణం, 12న బనాత అంబారీ వాహనసేవ, రాత్రికి అశ్వ-సింహ వాహనోత్సవాలు, ఉదయం 7.15 గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు. 13న తీర్థవారి ధ్వజావరోహణం, పల్లకీసేవ, అనంతరం 15న స్వామివారికి రాత్రి 9 గంటలకు ఆలయం లోపల పల్లకిసేవ, ఏకాంతసేవ ఉంటాయి. 16న ఉదయం 9.30 గంటలకు శాంతి అభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## వైకాపాలోకి భారీగా టీడీపీ యువత



గూడూరు పట్టణం అశోక్‌నగర్‌కి చెందిన కొల్లపూడి ఏడుకొండలు ఆధ్వర్యంలో 100 మంది యువత టీడీపీని వీడి గూడూరు నియోజకవర్గ వైకాపా అభ్యర్థి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సమక్షంలో వైసీపీలో చేరారు. మురళీధర్ ప్రతిఒక్కరికీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును గురించి ఆలోచించే ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని, యువత భవిత మరింత బాగుండాలంటే తిరిగి జగన్‌నే సీఎంను చేయాలని మురళీధర్ పిలుపునిచ్చారు. కాగా, గూడూరులో మురళీధర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామని పార్టీలో చేరిన యువత ముక్తకంఠంతో చెప్పగా, మీ భవిష్యత్తుకు ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుందని మురళీధర్ హామీ ఇచ్చారు. పట్టణ వైకాపా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి కాంద్ర నారాయణరెడ్డి, మైనారిటీ నాయకులు మగ్దూమ్, తాళ్లూరు శ్రీనివాసులు, కొండూరు సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర పాలకమండలి సమావేశం



ఆంధ్రప్రదేశ్‌ను చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ నిర్విరామంగా కృషి చేస్తోందని ఆ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎం.డి గంధం చంద్రుడు తెలిపారు. విజయవాడలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ జరిగిన పాలకమండలి సమావేశంలో వారు పాల్గొని అధికారులు, డైరెక్టర్లతో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

## దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తాం

### ధర్మరాజస్వామి దేవాలయం నూతన ఛైర్మెన్ బొమ్మిడి శ్రీనివాసులు



దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తామని గూడూరు పట్టణంలోని శ్రీ ద్రౌపతిదేవి సమేత ధర్మరాజస్వామి దేవస్థానం నూతన ఛైర్మెన్ బొమ్మిడి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీ దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం చేసింది. ఛైర్మెన్‌గా మరోసారి బొమ్మిడి శ్రీనివాసులు, సభ్యులుగా గుబ్బ నరసింహరావు, దువ్వూరు వినయకుమార్‌రెడ్డి, మందిపాటి శ్రీనివాసులు, శోధింబాక సంపూర్ణ, రాపూరు శాంతి, కుడుమల శ్రీవాణి, బండి విజయ, పల్లం వెంకటరత్నమ్మలను నియమిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా దేవస్థానం ఛైర్మెన్ బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ రూ.40 లక్షలతో గాలి గోపురం నిర్మించామని చెప్పారు. పలువురు ప్రతినిధులు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 57 కేంద్రాల్లో పల్స్‌పోలియో



రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గూడూరు నియోజకవర్గంలో 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పోలియో చుక్కలు వేసి విజయవంతం చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కిరణ్‌కుమార్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# నిండు జీవితాలకు.. రెండు పోలియో చుక్కలు

## ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు



నెల్లూరు నగరంలోని బీవీనగర్‌లో ఉన్న కురుగంటి నారాయణమ్మ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌడంగవే ఉత్తర్వుల మేరకు కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి నేవల్ యూనిట్ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు పాల్గొని హాజరైన చిన్నారులకు రెండు చుక్కల పోలియో నివారణ మందు వేశారు. "చిన్నారుల నిండైన జీవితానికి రెండు పోలియో రహిత చుక్కలు" గురించి ఆయన వివరిస్తూ, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ళ వయసున్న చిన్నారులందరికి పోలియో వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వ్యవహరించి పోలియో నివారణ చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని అరికట్టాలని చెప్పారు. అనంతరం ఈ కేంద్రంలో 214 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. లక్ష్యం మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి మిగిలిన చిన్నారులకు కూడా పోలియో డ్రాప్స్ వేస్తున్నట్లు చెప్పారు. వార్డ్ హెల్త్ సెక్రటరీ ఏ.ఎన్.ఎం బి.లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్తలు, నోడల్ ఆఫీసర్ వెంకటయ్య, ఎన్‌సిసి నేవల్ కేడెట్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాళెంలో పోలింగ్‌కేంద్రాల తనిఖీ

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం పరిధిలోని పోలింగ్‌కేంద్రాలను ఈనెల 4న తహశీల్దార్ విజయశ్రీ తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, వసతులు పటిష్టంగా ఉండాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, విఆర్ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేరుశెనగకు మద్దతు ధర

ప్రభుత్వం వేరుశెనగకు మద్దతు ధర ప్రకటించింది. నిర్దేశించిన నాణ్యతప్రమాణాల మేరకు క్వింటాలుకు రూ. 6377లను కనీస మద్దతు ధరగా నిర్ణయించింది. దీంతో జిల్లావ్యాప్తంగా వేరుశెనగ సేకరణకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈనెల 4న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన కొనుగోలు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 4273 ఎకరాల్లో వేరుశెనగ పంటను రైతులు సాగుచేశారని, ఆ పంటను మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## ఉమామహేశ్వరాలయానికి కుర్చీలు బహుకరణ

నెల్లూరు వహబ్‌పేటలోని శ్రీ ఉమామహేశ్వరాలయానికి ఈనెల 4న స్థానిక హరనాథపురానికి చెందిన రామరాజు నాగేశ్వరరావు పాతికవేల విలువచేసే 50 కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఎన్‌సి బాలాజీ సింగ్, జీసీ ధర్మసింగ్, ఇఓ బి.మల్లికార్జున్ రెడ్డి, అర్చకులు రామావఝుల శ్రీనివాస శర్మలు పాల్గొన్నారు.

# బస్సులు రాక.. బాధలు పడుతున్నాం

* కలెక్టర్‌కు విద్యార్థుల మొర



పాఠశాలలకు వెళ్లేందుకు సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిత్యం బాధలు పడుతున్నామంటూ విడవలూరు మండలంలోని తీరప్రాంత గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈనెల 4న కలెక్టరేట్ వద్దకు వచ్చి కలెక్టర్‌ను కలిసి తమ గోడు వినిపించుకున్నారు. పొన్నపూడి పెద్దపాళెం, లక్ష్మీపురం, వెంకటనారాయణపురం, గాదెలదిన్నె, రామచంద్రాపురం, రామతీర్థం, దండిగుంట, వరిణి తదితర గ్రామ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రామతీర్థంలో ఉన్న హైస్కూలుకు వెళ్ళాలంటే నిత్యం యాతనగా ఉంటోందని, ఆ బస్సు వచ్చి తాము వెళ్ళేసరికి ఒక తరగతి కూడా అయిపోతోందని, ఆన్‌లైన్ హాజరు నమోదు కావడం లేదని, అదేవిధంగా స్కూలు అయిపోయాక తిరిగి ఇళ్ళకు వద్దామంటే సాయంత్రం 4 నుంచి తాము వేచిచూస్తుంటే బస్సు మాత్రం రాత్రి 7 గంటలకు వస్తోందని వారు గోడుగోడుమన్నారు. వావిళ్ల, రామతీర్థంలలో ఉన్న హైస్కూళ్ళకు వెళ్ళాలంటే ఈ కష్టాలు తప్పడం లేదని, కలెక్టర్ పరిశీలించి తమకు సకాలంలో స్కూళ్ళకు వెళ్లేందుకు వీలుగా బస్సులు వచ్చే ఏర్పాటుచేయాలని వారు విన్నవించారు. దాదాపు వందమంది దాకా విద్యార్థులు రోజూ ఇలా అవస్థలు పడుతున్నారని, కలెక్టర్ పరిశీలించి సమస్యలు తీర్చాలని విద్యార్థుల తల్లితండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.




రామకథ మొత్తం వాల్మీకి మహర్షికి వివరంగా చెప్పి ఆయన చేత పూజలందుకొని ఆకాశమార్గాన దేవలోకం చేరుకున్నారు నారద మహర్షి. వాల్మీకి మౌని హృదయం అవధులులేని ఆనందంతో పొంగిపొర్లిపోయింది.

అవును!!!

అతడే ఆనందం! అతడే పరబ్రహ్మము! ఆనందమే పరబ్రహ్మము!

ఆ రామ బ్రహ్మము గూర్చి విన్న ఎవరి మనసు మాత్రము ఆనందంతో నిండిపోదు! ఆనంద స్వరూపుడుగదా ఆయన!

శిష్యులతో కలసి ప్రాతఃసంధ్యావందనమాచరించడానికి తమసా నదీ తీరం చేరుకున్నారు మహర్షి వాల్మీకి!

ఆ నదీ తీరం మనోహరంగా ఉన్నది! సమున్నతంగా పెరిగిన ఎన్నో జాతుల ఫలవృక్షాలు, వాటి మీద స్థిరనివాసమేర్పరచుకొన్న రకరకాల పక్షిజాతులు.. అవి చేసే కిలకిలారావాలు కడు రమణీయంగా ఉన్నది ఆ ప్రదేశం!

ప్రకృతికాంత ఎన్నో హొయలు ఒలకబోస్తున్నదక్కడ!

నిర్మలంగా, స్ఫటికమంత స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో కనులకింపుగా ఉన్నది తమసా నదీ ప్రవాహం!

తమస ఎలా ఉన్నదంటే...

**అకర్దమిదం తీర్థం భరద్వాజ నిశామయ**

**రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా**

ఒక మంచివాడి మనస్సు స్వచ్ఛంగా నిర్మలంగా ఏ కల్మషమూ లేకుండా ఎలా ఉంటుందో అలాగే ఏ మాత్రమూ బురదలేకుండా నిర్మలమనోహరంగా ఉన్నవట! తమసా జలాలు!

అత్యంత రమణీయంగా కనపడుతున్న ఆ ప్రదేశంలో స్నానమాచరించాలని నిశ్చయించుకొన్నారు మహర్షి.

అలా రేవులో దిగి చుట్టూ చూస్తున్నారాయన!

ఒక చెట్టుమీద రెండు క్రౌంచపక్షులు ప్రపంచాన్ని మరచి క్రీడిస్తున్నాయి, సరససల్లాపాలలో మునిగి తేలుతున్నాయవి!

ఆ సమయంలో ఎక్కడనుండి వచ్చిందో రివ్వున ఒకబాణం వచ్చి మగపక్షి గుండెల్లో సర్రున దిగబడింది.

అంతే! అప్పటిదాకా ఉన్న వాటి ఆనందం క్షణాల్లో మటుమాయమయిపోయింది. మగపక్షి రక్తపుమడుగులో పడి విలవిలా తన్నుకుంటూ ప్రాణం విడిచింది.

మగని శరీరం చుట్టూ తిరుగుతూ హృదయ విదారకంగా రోదిస్తున్నది ఆడపక్షి!.

ఆ దృశ్యం మహర్షి మనస్సును తీవ్రంగా కలచివేసింది! చుట్టూ చూశారాయన, ఒక బోయవాడు విల్లమ్ములు చేతబూని ఏదోసాధించిన వానిలా విజయగర్వంతో వస్తూ కనపడ్డాడు!

అప్రయత్నంగా మహర్షి నోటి వెంట ఒక శ్లోకం వెలువడ్డది!

**మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః**

**యత్ క్రౌంచమిథునాదేకమ్ అవధీః కామ మోహితమ్**

రతి సమయంలో ఆనందంగా కూడి ఉన్న పక్షుల జంటను విడదీసి నీవు శాశ్వతమైన అప్రదిష్ఠ మూటకట్టుకున్నావు! (అని అర్థము)

అప్రయత్నంగా తన నోటినుండి వెలువడిన ఆ పదముల కూర్పునకు మహర్షి ఆశ్చర్యచకితులయ్యారు!

ఆ కూర్పును ఒకసారి పరిశీలించారు!

అవి నాలుగు పాదములతో కూర్చబడి ఉన్నాయి!

వీణపై కూర్చి నృత్యగీత వాద్యాదులతో పాడటానికి ఒక క్రమ పద్ధతిలో లయబద్ధంగా కూడా ఉన్నాయి!

ఆ విషాద ఘటన మదిలో కదలాడుతూ ఉండగా భారమైన మనస్సుతో ఆశ్రమం చేరుకున్నారు మహర్షి!

ఆయన అలా వేదనలో ఉండగానే బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయినారు!

బ్రహ్మదేవునకు నమస్కరించి అర్ఘ్యపాద్యాదులొసగి ఒక ఆసనముపై ఆయనను కూర్చుండబెట్టి వినయముగా ఆయన చెంతన మహర్షి నిలుచున్నారు.

ఈ పనులన్నీ చేస్తున్నా కూడా ఆయన మనసులో క్రౌంచపక్షులను బోయవాడుకొట్టిన ఉదంతం, తాను పలికిన పలుకులు మెదులుతూ ఉన్నాయి.

అన్యమనస్కంగా ఉన్నారు మహర్షి.

ఆయన అవస్థ గమనించిన విరించి చిరునవ్వు నవ్వుతూ మహర్షీ నీ నోటి నుండి వెలువడినది శ్లోకమే! సందేహము లేదు! అది నా ఇచ్ఛవలననే నీ నోటినుండి వెలువడినది!

ఆ శ్లోకం ఉన్న రీతిలోనే నీవు రామకథను రచియించవయ్యా!....

అని చెపుతున్నారు చతుర్ముఖుడు!

నారదుని వలన నీకు ఏవిధముగా రామ కథ చెప్పబడెనో ఆ విధముగనే నీవు రామ కథ చెప్పు.

రాముడు ధర్మాత్ముడు,లోకములో శ్రేష్ఠమైన గుణములు అని మనము చెప్పుకొనేవన్నీ కూడా ఆయనలో ఉన్నాయి!

రాముని గూర్చిన అన్నివిషయములు నీకు తేటతెల్లము కాగలవు!

**"కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్"**

మనస్సును రమింపచేసేది, పుణ్యప్రదము అయిన రామకథను అక్షరబద్ధం చేయి నీవు వ్రాసిన ప్రతి విషయము అక్షరసత్యము కాగలదు!.

**యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే**

**తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి!**

....ఎప్పటి వరకైతే భూమిమీద పర్వతాలు నిలచి ఉంటాయో!

ఎప్పటివరకైతే భూమి మీద నదులు పారుతూ ఉంటాయో

అప్పటివరకు భూమి మీద రామకథ ప్రాచుర్యంలో ఉంటుంది!.

అప్పటివరకు నీవుపుణ్యలోకాలలో స్వేచ్ఛగా సంచరించగలవు!

అని పలికి బ్రహ్మదేవుడు అంతర్ధానమైనారు.

బ్రహ్మ వరం చేత మహర్షి మనోఫలకం మీద (మనసు తెర మీద) రామచరిత మొత్తం కనపడజొచ్చింది! రామకథను అక్షరబద్ధం చేయటానికి మహర్షి సంకల్పం గావించుకొన్నారు!



పూర్వము ఇక్ష్వాకులు అని ఒక రాజవంశముండేది! వారు కోసల దేశాన్ని పరిపాలిస్తూ ఉండేవారు.

అయోధ్యా నగరాన్ని రాజధానిగా చేసుకొన్నారు.

విశాలమైన రాజమార్గాలతో శోభాయమానంగా ఉండే పట్టణం అయోధ్య! ఉన్నతమైన కోట బురుజులు, వందలకొద్దీ శతఘ్నులు మొహరించి ఉండేవి! రాజ్య రక్షణ వ్యవస్థ శత్రు దుర్భేద్యంగా ఉండేది.

ప్రజలంతా ధనధాన్యసమృద్ధితో, సుఖసంతోషాలతో, ఆనందంగా ఏ లోటు లేకుండా జీవనం సాగించేవారు.

ఆ సమయంలో దశరథుడు దేవేంద్రుడిలాగా రాజ్యపాలన చేస్తున్నాడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకుంటూ ఉండేవారాయన!.

దశరథమహారాజు వద్ద ఎనమండుగురు మంత్రులుండేవారు!

వారు అపూర్వమైన మేధాశక్తి కలవారు! ఎదుటివ్యక్తి ముఖకవళికలను బట్టి వారి మనస్సులోని ఉద్దేశ్యము గ్రహించేవారు!

రాజుకు మేలుకలిగించేవి, హితకరంగా ఉండేవి మరియు ఆయనకు ప్రియమైన పనులు చేయటంలో వారు కడు సమర్థులు.

వారు వరుసగా, ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు.

వసిష్ఠ, వామదేవులు ప్రధాన ఋత్విక్కులు

మంత్రులందరూ అత్యంత నిబద్ధతో మెలిగేవారు, పటిష్ఠమైన గూఢచార వ్యవస్థ కలిగి, రాజ్యము నలుమూలాల ఏమి జరిగినా క్షణాలలో తెలిసేటట్లుగా ఏర్పాటు గావించుకొన్నారు.


ఆ మంత్రులు, స్వయముగా తమ పుత్రులు తప్పు చేసినా వారిని దండించడంలో వెనుకాడేవారుకాదు! వ్యక్తులు చేసిన అపరాధ తీవ్రతను బట్టి శిక్షలు అమలు చేస్తూ ఉండేవారు! బలవంతుడైన వ్యక్తి, బలహీనుడైన వ్యక్తి ఒకే తప్పు చేస్తే బలవంతుడికి శిక్ష తీవ్రత ఎక్కువగా ఉండేది! (సరిగ్గా నేటి వ్యవహారానికి పూర్తి వ్యతిరేకము).

రాజ్యము, రాజ్యాంగము అంటే భయభక్తులతో మెలిగేవారు!

రాజ్యమందు ఎక్కడా కూడా ప్రజలలో అసంతృప్తి లేకుండా అద్భుతమైన పరిపాలనా వ్యవస్థ కలిగి మహేంద్రవైభవంతో పరిపాలన సాగిస్తున్నాడు దశరథమహారాజు!.

..(సశేషం)

# కళ్యాణ వైభవం...!




జిల్లాలోనే సుప్రసిద్ధ న్యాయవాదిగా పేరుగాంచిన స్వర్గీయ మలిరెడ్డి కృష్ణప్రసాద్ మనుమరాలు, అడ్వకేట్ మలిరెడ్డి కోటారెడ్డి - లావణ్యల కుమార్తె **డాక్టర్ అభిజ్ఞ - డాక్టర్ యాచేంద్రకుమార్‌రెడ్డి** (నెల్లూరుజిల్లా, సిద్ధీపురం వాస్తవ్యులు సూరా శ్రీనివాసులురెడ్డి - రమాదేవిల కుమారుడు)ల కళ్యాణం ఫిబ్రవరి 28న నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

# వీపీఆర్ - వీఎస్ఆర్

(3వ పేజీ తరువాయి)

ఉచితంగా అందిస్తున్నారు. అదే ప్రాంగణంలో తన పేరుతోనే వీపీఆర్ వైద్యం పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేసి రోజూ ఉదయం నుండి సాయంత్రం వరకూ ఆ వైద్యాలయానికి వచ్చే రోగులకు అవసరమైన చికిత్సతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మారుమూల గ్రామాలలో సైతం 125కి పైగా వాటర్‌ప్లాంట్లని ఏర్పాటుచేసి మంచినీరు అందిస్తున్నారు. సమాజంలో ప్రజలని చైతన్యవంతుల్ని చేసి స్ఫూర్తి కలిగించిన ప్రముఖుల విగ్రహాలు నెలకొల్పడానికి పూర్తి ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. వాగ్గేయకారులు అన్నమాచార్యులు, సుప్రసిద్ధ సంఘ సంస్కర్తలు జ్యోతిరావు పూలే దంపతులు, ఉమ్మడిరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, సుప్రసిద్ధ సినీ గాయకులు ఘంటసాల వంటి ప్రముఖుల విగ్రహాలు నెల్లూరులో ఏర్పాటుచేయడానికి ప్రధాన కారకులు ప్రభాకరరెడ్డే. ఈ కార్యక్రమాలన్నిటి కోసం తన పేరుతో వీపిఆర్ ఫౌండేషన్‌ని ఏర్పాటు చేశారు.

## ఆధ్యాత్మిక సారధి...

ప్రభాకరరెడ్డి చేసిన, చేస్తున్న భక్తి కార్యక్రమాలకి ఆకాశమే హద్దు. జిల్లాలోని అనేక దేవాలయాల జీర్ణోద్ధరణకి ఆయన చేయూతనందించారు. శ్రీ వెంకటేశ్వరస్వామివారి వైభవోత్సవాలను రెండు పర్యాయాలు నెల్లూరులో నిర్వహించి కొన్ని లక్షలమంది భక్తులకు స్వామివారి నిత్య సేవలను తిలకించే అవకాశం కల్పించారు. ప్రతి ఏటా లక్షదీపోత్సవ కార్యక్రమాలని వైభవోపేతంగా జరిపిస్తారు. జిల్లాతో పాటు రాష్ట్రంలో పలు దేవాలయాలలో కుంభాభిషేకాలను కూడా నిర్వహించారు.

మొన్నటివరకు ఆయన అధికార పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ అభ్యర్థిగానే రాజ్యసభలో అడుగుపెట్టారు. ఇప్పుడు తెలుగుదేశంలోకి వెళ్లారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయబోతున్నారు. నెల్లూరు నియోజకవర్గ పార్లమెంటు అభ్యర్థిగా ప్రజల ఆశీస్సుల కోసం ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డికి అంతరంగికుడు విజయసాయిరెడ్డి!

నెల్లూరుజిల్లా తాళ్లపూడి విజయసాయిరెడ్డి స్వగ్రామం. వృత్తిరీత్యా ఆయన ఆడిటర్. రాజకీయాలని తన ప్రవృత్తిగా మార్చుకుని లెక్కల మాంత్రికుడు కాస్తా రాజకీయ తాంత్రికుడిగా మారారు. రాజశేఖరరెడ్డి హయాం నుండి వై.ఎస్. కుటుంబానికి అత్యంత సన్నిహితులు సాయిరెడ్డి. మద్రాసు కేంద్రంగా తన వృత్తి, వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 2005లో సాయిరెడ్డి తన మకాం హైదరాబాదుకి మార్చారు. ఆ కుటుంబంతో ఆయన అనుబంధం అంతలా ఉండేది. తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టు బోర్డు సభ్యుడిగా రాజశేఖరరెడ్డి సాయిరెడ్డికి రెండుసార్లు అవకాశం కల్పించారు. రాజశేఖరరెడ్డి జీవించి ఉన్నప్పుడే సాయిరెడ్డి వై.ఎస్. కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డికి బాగా దగ్గరయ్యారు. వ్యాపార వ్యవహారాలలో మార్గదర్శకుడిగా సముచిత సలహాలిస్తూ జగన్‌కి ఆర్థిక సలహాదారుడిగా అత్యంత ఆంతరంగికుడిగా మారిపోయారు. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తరువాత వీరిద్దరి బంధం మరింత గట్టిపడింది. జగన్‌పై కక్షతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో సాయిరెడ్డి కూడా బలయ్యారు. తన కోసం సాయిరెడ్డి చేసిన త్యాగాన్ని జగన్‌మోహన్‌రెడ్డి మరువలేదు. 2016లోనే అంటే వైసీపీ అధికారంలోకి రాకముందే సాయిరెడ్డికి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి పెద్దల సభకి పంపించారు. మే 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా సాయిరెడ్డికి అత్యంత ప్రాధాన్యతని కల్పించారు. మళ్ళీ 2022లో కూడా సాయిరెడ్డిని రాజ్యసభకు పంపి రెండవసారి అవకాశం ఇచ్చారు. తన చుట్టూ ఉన్న నలుగురు కీలక వ్యక్తులలో సాయిరెడ్డి కూడా ఒకరన్న సంకేతాన్ని అటు అధికార వర్గాలకి, ఇటు పార్టీ శ్రేణులకు స్పష్టంగా ఇచ్చారు జగన్.

ఇప్పుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పార్టీ మారడాన్ని జీర్ణించుకోలేని జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విజయసాయిరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేసి విజయం సాధించి తిరిగిరా అంటూ ఆశీర్వదించి పంపించారు. సాయిరెడ్డికి మంచి వాక్చాతుర్యం ఉంది. వ్యవస్థల్ని మానేజ్ చేయగలగడం ఆయనకి వెన్నతో పెట్టిన విద్య. సామాజిక మాధ్యమాలతో పాటు ఇతర మీడియా సాధనాలను సమర్థవంతంగా వాడుకోవడంలో ఆయన ధిట్ట.

మొన్నటివరకూ పార్టీ వేదికగా రాజ్యసభ అభ్యర్థులుగా రాజకీయాలు చేసిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి ఇద్దరూ తొలిసారిగా ప్రజాక్షేత్రంలోకి వచ్చి తలపడబోతున్నారు.

ప్రజాసేవలో మూడు దశాబ్దాలుగా ఉండి జిల్లాలో గుర్తింపు పొందినవారు ఒకరైతే, పార్టీకి విధేయుడిగా, ముఖ్యమంత్రికి అంతరంగికుడిగా, అధికారపార్టీలో కీలకవ్యక్తిగా, అన్నింటినీ మించి నెల్లూరుజిల్లా వాడిగా బరిలో దిగిన వారు రెండవ వారు. ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా ఉన్న వీరిద్దరి పోరులో ప్రజలు ఎవరి వైపు నిలుస్తారో వేచి చూడాలి!

# ఆంధ్రాలో.. గ్యాంగ్ వార్

(మొదటి పేజీ తరువాయి)

తాను అధికారంలోకి వచ్చిన వెంటనే, మళ్ళీ అయిదేళ్ళ తరువాత రాబోయే ఎన్నికల కోసం అవసరమైన వ్యూహాన్ని రచించుకున్నారు. పన్నుల రూపంలో వచ్చిన లక్షల కోట్ల ప్రభుత్వ ప్రజాధనాన్ని అధికారికంగా బటన్ నొక్కడం ద్వారా ఓటర్ల ఖాతాలోకి పంపించేశారు. తన మంత్రులకి, శాసనసభ్యులకు కూడా పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశారు. వారి చేతికి అడ్డు ఆపు లేకుండా దోచుకోవడానికి లైసెన్స్ ఇచ్చారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడడానికి అనుమతి కల్పించారు. బూతులలో పిహెచ్‌డీ చేసిన వారికి మంత్రి పదవి కూడా కానుకగా ఇచ్చి మరీ ప్రతిపక్షాల వారిని తిట్టించారు. అదేమంటే తెలుగుతమ్ముళ్లు మమ్మల్ని తిట్టారు కాబట్టి, వాళ్లని వందరెట్లు బూతులు నేర్చుకుని మరీ మేము తిడుతున్నాం అని వైసీపీ నేతలు చెప్పుకుంటున్నారు.

## ఆంధ్ర రాజకీయాలు 2014కి ముందు.. ఆ తరువాత!

ఆంధ్రా రాజకీయాలు 2014కి ముందూ, ఆ తరువాత అన్నట్లుగా మారిపోయాయి. అంతకుముందు 2009లో జరిగిన ఎన్నికల నాటికి రాష్ట్రం విడిపోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఒక్కటే బలమైన ప్రాంతీయ పార్టీగా అవతరించి ఉండేది. ఎన్నికలు వచ్చినప్పుడల్లా జాతీయపార్టీ కాంగ్రెస్‌తో టీడీపీ తలపడేది. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్ర రాజకీయాల స్వరూపమే పూర్తిగా మారిపోయింది. రాష్ట్రం చిన్నదైపోయింది. కాంగ్రెస్ చచ్చిపోయింది. కొత్త రాష్ట్రంలో టీడీపీకి ధీటుగా జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీని స్థాపించారు. రెండూ ప్రాంతీయ పార్టీలే కావడంతో రాష్ట్ర రాజకీయం జాతీయస్థాయి నుండి బజారుస్థాయికి పడిపోయింది. పాత రోజుల్లో వీధి కొళాయి వద్ద జుట్టు జుట్టు పట్టుకుని ఆడోళ్ళు కొట్టుకున్నట్లుగా ఈ రెండు ప్రాంతీయపార్టీల నాయకులు తన్నుకోవడం మొదలుపెట్టారు. తమ ఆధిపత్య పోరులో రాజకీయాల స్థాయిని పూర్తిగా దిగజార్చేశారు. కొన్ని పార్టీల మధ్య జరగాల్సిన ఎన్నికలు ఇప్పుడు కొన్ని ముఠాల మధ్య జరగబోతున్నాయి. అక్రమంగా సంపాదించిన నోట్ల మూటలతో, బూతులలో పట్టా పొందిన ఘాటైన మాటలతో, జిమ్ములలో పెంచుకున్న కండలతో తాడోపేడో తేల్చుకోవడానికి "సై" అంటున్న తన గ్యాంగుతో జగన్‌మోహన్‌రెడ్డి "సిద్ధం" అంటున్నారు.

యుద్ధానికి మేం కూడా "సంసిద్ధమే" అంటూ ప్రతిపక్షపార్టీలన్నీ ఒక్కటై కదనరంగంలో దూకబోతున్నాయి. అధికారపార్టీని గద్దె దించడానికి ఆ పార్టీలు కూడా తమ మంది మార్బలాన్ని రెడీ చేసుకుంటున్నాయి. ఏ స్థాయికైనా దిగజారడానికి మేం కూడా తయారే అన్నట్లుగా అధికారపార్టీని రెచ్చగొడుతున్నాయి. చంద్రబాబు సైతం తన ప్రసంగాలలో వాడి వేడి పెంచారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్‌తో జతకట్టారు. రేపో ఎల్లుండో కమలంతో పొత్తుని కూడా ఖరారు చేసుకోవడానికి ఉబలాట పడుతున్నారు. జగన్ సోదరి షర్మిల కూడా స్పీడు పెంచింది. తన మరో సోదరి సునీతతో కలిసి అన్నపై వాగ్బాణాలను సంధిస్తోంది.

ఇలా ఎవరి స్థాయిలో వాళ్ళు వీధి పోరాటానికి సిద్ధపడుతున్నారు. గౌరవప్రదంగా జరగాల్సిన ఎన్నికలని సవాళ్లతో, ప్రతిసవాళ్ళతో "గ్యాంగ్ వార్"గా మార్చి తన్నుకుని తలకలు పోసుకోవడానికి తయారవుతున్నారు!

# శ్రీసిటీలో మిజోరం గవర్నర్



మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఈనెల 6న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీలోని పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. గతంలో వెనుకబడివున్న ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషిని, అంకితభావాన్ని ఆయన అభినందించారు. 'ఆత్మనిర్భర భారత్'కు మద్దతుగా రక్షణ, అంతరిక్ష రంగాల పరికరాల తయారీ పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలని, అందుకోసం శ్రీసిటీలో ప్రత్యేక జోన్ ఏర్పాటు కోసం పరిశీలించాలని ఆయన సూచించారు. గవర్నర్‌కు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, ఆయనతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# నేత్రపర్వం.. శ్రీ మూలస్థానేశ్వరుని బ్రహ్మోత్సవం

## అత్యంత వైభవంగా శివరాత్రి ఉత్సవాలు



నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 3 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం (3వతేది) రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. తొలుత స్వామివారికి, అమ్మవారికి కన్నులపండువగా అలంకరణలు చేసి ప్రత్యేకపూజల అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. దేవాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ లోకిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ఇఓ ఆరంబాకం వేణుగోపాల్ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. మార్చి 4వ తేది ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం సింహవాహనోత్సవ సేవలు ఘనంగా జరిగాయి. 5న చప్పర ఉత్సవం, పురుషామృగవాహన సేవ, 6న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి శేషవాహనోత్సవం, 7వ తేది ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి వెండి రావణసేవ కనువిందుగా నిర్వహించారు.

## 8న మహాశివరాత్రి వేడుకలు :

మార్చి 8వ తేది శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ మూలస్థానేశ్వర స్వామివారికి విశేష పూజలు, విశిష్ట సేవలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి. ఉదయం గిన్నెభిక్ష, రాత్రి లింగోద్భవ కాల అభిషేకం, అర్ధరాత్రి తర్వాత 1 గంటకు వెండినంది సేవ ఉత్సవాలు వైభవోపేతంగా జరుగ నున్నాయి. 9న స్వామివారి కల్యాణోత్సవం, అనంతరం గజవాహనసేవ, 10వ తేది ఉదయం 9 గంటలకు రథోత్సవం, 11న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రికి పులి వాహనోత్సవం, 12న ఉదయం చప్పర ఉత్సవం, రాత్రికి అలకలతోపు వేడుక, 13న ఉదయం తీర్థవాది, రాత్రికి ధ్వజావరోహణం, తిరుచ్చి ఉత్సవం, 14న ధవనోత్సవం, 15వ తేది రాత్రి ఏకాంతసేవ నిర్వహించనున్నారు.

# ఎన్‌బికెఆర్‌లో 'పరిగ్రాహ్‌-2024' సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్‌ ఇన్‌స్టిట్యూట్‌ సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల పరిగ్రాహ్‌-2024 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. వివిధ కళాశాలల నుంచి సుమారు 70కి పైగా సాంకేతిక పత్రాలను విద్యార్థులు సమర్పించగా, వాటిలో అత్యున్నతమైన 29 పత్రాలను ఎంపిక చేసి వారికి పోటీ నిర్వహించారు. అంతేకాక, పోస్టర్‌ ప్రెజెంటేషన్‌, టెక్నికల్‌ క్విజ్‌, వ్యాసరచన, ఇంజనీరింగ్‌ ఆర్ట్స్‌ పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా డిజిపిఎస్‌, టోటల్‌ స్టేషన్‌, ఇ-సర్వే సాఫ్ట్‌వేర్‌లను ల్యాండ్‌ సర్వేయింగ్‌లో ఎలా వినియోగించాలనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ పాలిటెక్నిక్‌ విద్యార్థులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల డైరెక్టర్‌ డా. వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ ఆర్థికవ్యవస్థను ప్రభావితం చేసే రంగాల్లో నిర్మాణరంగం చాలా కీలకమైనదని, విద్యార్థులు సివిల్‌ ఇంజనీరింగ్‌ను అభ్యసించడం వల్ల వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవచ్చని సూచించారు. సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగాధిపతి డా.డి.శ్రీనివాస్‌ మాట్లాడుతూ, సివిల్‌ ఇంజనీరింగ్‌ చదువుకుంటే ఉద్యోగావకాశాలకు లోటుండదన్నారు. ఇంజనీరింగ్‌ చదవడమంటే దేశ పురోభివృద్ధిలో భాగస్వామ్యులైనట్లేనని ఈ సదస్సులో పాల్గొన్న ప్రొ.పివి సుబ్బారెడ్డి చెప్పారు. సదస్సు కన్వీనర్‌ కె.సందీప్‌కుమార్‌, ట్రిబుల్‌-ఇ విభాగాధిపతి డా.ఎస్‌ సురేష్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా.హరినాథ్‌రెడ్డి, వ్యాయామవిద్య విభాగాధిపతి డా.వి.మల్లికార్జున్‌రెడ్డి, గ్రంథాలయ విభాగాధిపతి పి.రామిరెడ్డి పాల్గొన్నారు.

కాలధర్మం

# అశోక్‌ శశికళ



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అక్క అశోక్‌ శశికళ మార్చి 4వ తేదీ సోమవారం తన 71వ ఏట కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆమె అస్వస్థతతో ఉన్నారు. స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి - శ్యామలమ్మ దంపతుల రెండవ సంతానంగా 1953 అక్టోబర్‌ 18వ తేదీన శశికళ జన్మించారు. ఆమె బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరు లోనే జరిగింది. డీకేడబ్ల్యు కాలేజీలో డిగ్రీ అందుకున్నారు. తమిళనాడులోని జోలార్‌పేటకు చెందిన అశోక్‌రెడ్డిని 1973 నవంబర్‌ 15న శశికళ పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయి 30 సంవత్సరాలు అక్కడే ఉన్నారు. ఆ తరువాత ఆమె తండ్రి శివకోటారెడ్డి 2001 మార్చిలో కన్నుమూయడంతో 2002లో తమ అమ్మకి తోడుగా ఉండడం కోసం భర్తతో సహా ఆమె నెల్లూరుకు వచ్చేశారు. అమ్మ శ్యామలమ్మని కళ్లల్లో పెట్టుకుని చూసుకున్నారు. అశోక్‌రెడ్డిని పరిణయమాడిన తరువాత తమిళ సంప్రదాయం ప్రకారం ఆమె ఇంటిపేరు అశోక్‌గా మారింది. శశికళ - అశోక్‌ దంపతులకి చందన్‌, చరణ్‌ ఇద్దరు కుమారులు ఉన్నారు. వేమిరెడ్డి కోటారెడ్డి శశికళకి అన్న కాగా ప్రభాకరరెడ్డి తమ్ముడు. శశికళ నిష్క్రమణతో శోకసముద్రంలో ఉన్న అశోక్‌రెడ్డి, వేమిరెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్‌'.

## నవలా రచయిత్రి

# పూజిత.. ఇక లేరు



నెల్లూరుకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి పూజిత ఇక లేరు. అనారోగ్యంతో ఆమె గతనెల 27న చెన్నైలో కన్నుమూశారు. ఆమె భర్త.. ప్రముఖ వైద్యులు డాక్టర్‌ కె.రమణయ్య కొద్ది నెలల క్రితం మరణించడంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారు. పూజిత 20కిపైగా నవలలు రాశారు. 30 నాటికలు, వందకు పైగానే కథలు, కవితలు రచించి నెల్లూరు సాహితీ లోకంలో సుప్రసిద్ధులయ్యారు. ఆమె రాసిన పలు కథలు కన్నడభాషలోకి కూడా అనువాదమయ్యాయి. సమాజ వికాసమే ధ్యేయంగా ఆమె రాసిన నవలలు ఆమెకెంతో పేరు తెచ్చాయి. సాహితీ రంగంలో ఆమెకు అనేక అవార్డులు వచ్చాయి. 2019లో విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగుమహాసభల్లో ఆమెకు 'మహిళా రత్న' బిరుదుతో పాటు విశిష్ట పురస్కారం కూడా లభించింది. ఆమె మరణంతో నెల్లూరుసీమ ఒక సీనియర్‌ నవలా రచయిత్రిని, మంచి సాహితీరత్నాన్ని కోల్పోయినట్లయింది.

## ప్రముఖ పద్యకవి

# వనం సుబ్రహ్మణ్యం.. అస్తమయం



నెల్లూరు సమీపంలోని పడుగుపాడు గ్రామ నివాసి, ప్రముఖ పద్యకవి వనం సుబ్రహ్మణ్యం మార్చి 4వ తేదీన పరమపదించారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. నెల్లూరులో చీఫ్‌ ప్లానింగ్‌ ఆఫీసర్‌గా పని చేసి, విశ్రాంత జీవితం గడుపుతుండేవారు. కోవూరులో రాష్ట్రప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘానికి ఎనలేని సేవలందించారు. 'నిత్యసత్యాలు', 'వనము వారి మాట వాస్తవమ్ము' అనే పద్యశతకాలను ఆయన రచించారు. సాయినాథునిపై పరమభక్తి. సాహితీపరిశోధనపై, ప్రాచీన దేవాలయాల చరిత్రపై మక్కువ ఎక్కువ. రచనారంగంలో పలు అవార్డులు, పురస్కారాలు పొందారు. 'లాయర్‌' పత్రికకు కూడా ఆయన అప్పుడప్పుడూ పద్యాలు రాసేవారు. సౌమ్యులు, సహృదయులైన వనం వారి మృతికి విచారం ప్రకటిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్‌'!..

## ఏసీ స్టేడియంలో..

# ముందస్తు మహిళా దినోత్సవం




మహిళలను అందరూ గౌరవించాలని, ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో... ఆ ప్రాంతం, ఎక్కడ స్త్రీలకు రక్షణ ఉంటుందో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ స్టేడియం మహిళా వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ముందస్తుగా ఈనెల 4న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆ అసోసియేషన్‌ అధ్యక్షురాలు ఎం.భారతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ ప్రెసిడెంట్‌ ఎం.వి సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. నేటికాలంలో మహిళలు అనేక రంగాల్లో విజయాలు సాధిస్తూ ఉన్నతంగా రాణిస్తున్నారని, మహిళల అభ్యున్నతికి అందరూ చేదోడుగా నిలవాలని ఆయన అన్నారు. అనంతరం, మహిళలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక అపోలో ఆసుపత్రి పీడియాట్రిషన్‌ డాక్టర్‌ ఏ.రూప వివరించారు.

అసోసియేషన్‌ వ్యవస్థాపకులు వి.అరుణాచలం, వాకర్స్‌ ప్రముఖులు వై.రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎన్‌.రాఘవేంద్రషెట్టి, డాక్టర్‌ కె.అంకిరెడ్డి, వి.ప్రమీలమ్మ, కె.సుశీలమ్మ, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులందజేశారు.

# సమస్తం.. ఆమే



ఆమె రెక్కలు విప్పి ఎగరాలే గానీ
ఆకాశం చిన్నదైపోదూ...!
ఆమె ఊహలకు ఆకృతిని అందించాలే కానీ
వైపరీత్యాలు పుట్టుకురావూ...!
ఆమె గట్టిగా పిడికిలిని బిగించాలేగానీ
ప్రతికూలతలన్నీ ఏకపక్షంగా అనుకూలించవూ...!
ఆమె అడుగులలో అడుగేసి సాగాలేగానీ
కనుగొనని తీరాలంటూ ఉంటాయా...!
నిన్నటి గతం, నేటి వాస్తవం, రేపటి భవిష్యత్తు
మొత్తం అంతా ఆమే!...
ఆమె ఏకవచనం కాదు
సమస్తం ఆమే...
భార్యగా బాధ్యతలు చేపట్టి
సహచరిగా సలహాలు అందించేది...
తల్లిగా ఆలనా పాలనా చూసేది...
గురువై విద్యను బోధించేది...
అక్క, చెల్లె, వదినై
బంధాలలో భాగస్వామ్యాన్ని అందుకునేది...
ప్రేమ తీగలను పరచి
కుటుంబ వ్యవస్థను పటిష్ఠం చేసేది...
ముంగిలిలో ముగ్గై,
వాకిళ్లలో తోరణమై ఇంటికి కళను తెచ్చేది...
కోవెలలో దీపమై, పరిపూర్ణ రూపమై
కాలాన్ని నడిపించేదీ..ఆమే!
తన ఊపిరిని ఆయువుగా చేసి సృష్టికి ప్రాణం పోసేది...
సమస్త మానవ మనుగడను
తనలో సమ్మిళితం చేసుకొని
ఆదిశక్తిగా అవతరించి ఉద్ధరించేది ఆమే!
పాత్ర ఏదైనా ప్రాణం పోయాలంటే
ఆమెకు పిలుపునందివ్వాల్సిందే....
వేదికైనా, వేడుకైనా, శుభకార్యమైనా, ఏ కార్యమైనా
ఆమె పరిపూర్ణత వర్ణనాతీతం...
ఆమెకు రంగులతో, హంగులతో పనే లేదు
ఆమె అస్తిత్వమే ప్రత్యేకం...
ఆమె పాదం మోపని చోట
పచ్చదనం పరిమళించదు...
ఆమె ఒక ఆదర్శం మాత్రమే కాదు..
ఓ అద్భుతం, అపురూపం కూడా!

(మార్చి 8, అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా..)



డా. నీలం స్వాతి
ఫోన్‌ : 6302811961


## నాల్గవ వర్ధంతి



స్వర్గీయ కామిరెడ్డి లక్ష్మీకాంతమ్మ గారు
జననం: 1-7-1940 మరణం: 25-2-2020

అందరికి మమతానురాగాలను పంచి మా కుటుంబ అభివృద్ధికి జీవితాంతం శ్రమించి పరమపదించిన మా ఇంటి దైవం

స్వర్గీయ కామిరెడ్డి లక్ష్మీకాంతమ్మ గారి

నాల్గవ వర్ధంతి తే.12-03-2024ది (తిథుల ప్రకారం) సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారికి ఆత్మశాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త : కామిరెడ్డి గోపాలరెడ్డి మరియు కుటుంబ సభ్యులు

మాజీ అధ్యక్షులు, శ్రీ అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజం, మూలాపేట, నెల్లూరు. సెల్‌: 9347208354

Plot No: 87, LS Nagar, Tirupati - 517 502

# ఆదర్శప్రాయుడు.. వంగల్లు కోదండరామిరెడ్డి

## - ప్రశంసించిన పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ప్రజాసేవే పరమార్ధంగా నిలిచి ఆదర్శవంతంగా జీవించిన స్వాతంత్ర్య యోధుడు, తొలి తరం ప్రజానాయకుడు.. ఆదర్శప్రాయుడు వంగల్లు కోదండరామిరెడ్డి అని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. నాటి కాలంలో రాజకీయనాయకులు ప్రజాసేవే పరమార్ధంగా జీవించారని, నేటి రాజకీయాలో అలాంటి విలువలు దిగజారిపోతున్నాయని, కొంతమంది తీరు వల్ల రాజకీయాలంటేనే ప్రజలు విసుక్కొంటున్నారని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 7వ తేదీ గురువారం ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, సర్వేపల్లి నియోజకవర్గం తొలి శాసన సభ్యులు, దివంగత ప్రజానాయకుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాల గురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి-రచయిత డా. రేవూరు అనంతపద్మనాభరావు 'విస్మృత ప్రజానాయకుడు వంగల్లు కోదండరామిరెడ్డి' పేరుతో పుస్తకాన్ని రచించగా, పద్మభూషణ్ డా.కెఐ వరప్రసాద్‌రెడ్డి సహకారంతో ఆ పుస్తకాన్ని ప్రచురించగా, వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ బాటలో నడుస్తూ దేశస్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని, నెల్లూరుజిల్లా నుంచి కస్తూరిదేవి విద్యాలయం స్థాపకురాలు పొణకా కనకమ్మ, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, వెన్నెలకంటి రాఘవయ్య వంటి వారు నాటికాలంలో దేశభక్తితో పోరాటం సాగించారని, ఆ కోవలో వంగల్లు కోదండరామిరెడ్డి(వీకేఆర్) దేశభక్తితో ఆరోజుల్లో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుశిక్షలు అనుభవించారని అన్నారు. ఆ తర్వాత కాలంలో దిగ్గజాల వంటి పార్లమెంట్ సభ్యుల సరసన నిలిచి, ప్రజాసంక్షేమమే పరమావధిగా విలువలతో కూడిన రాజకీయాలను నడిపారన్నారు. సర్వేపల్లి శాసనసభ్యునిగా, నాటి ప్రొవిజినల్ పార్లమెంట్ సభ్యులుగా, రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. జిల్లా రైతాంగం కోసం ఆనాడే కనుపూరు కాలువను తెచ్చి రైతాంగానికి మేలుచేశారన్నారు. తొలితరం ప్రజానాయకుడైన వంగల్లును విస్మరించకూడదని, అలాంటి నేతకు స్మారకంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటుచేయడం సముచితమని, అందుకు తనవంతు సహకారం కూడా ఉంటుందని అన్నారు. అంతేకాదు, కనుపూరు కాలువకు ఆయన పేరు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేయడం బాగుంటుందన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి నాయకుల్లోని కార్యదీక్షత, పట్టుదల నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. ప్రొవిజినల్ పార్లమెంట్ సభ్యులుగా, రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులుగా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన వంగల్లు కోదండరామిరెడ్డి ఉండడం గొప్పవిషయమని, అలాంటి మహనీయుని స్మారకంగా ఆయన విగ్రహస్థాపనకు, కనుపూరుకాలువకు ఆయన పేరు పెట్టేందుకు కూడా తాము తమవంతు కృషిచేస్తామని ఈ సభలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వంగల్లు కోదండరామిరెడ్డి తన 20 ఎకరాల భూమిని కూడా అమ్మేసి రాజకీయాల్లో నిరాడంబరంగా ఉండేవారని, ఆయన రైతుబాంధవుడని.. నిష్కళంక చరితుడని కాంగ్రెస్ సీనియర్ నేత సీవీ శేషారెడ్డి కొనియాడారు. వంగల్లు జీవిత విశేషాలను తొలుత పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ వివరించారు. పద్మజారెడ్డి ఆధ్వర్యంలో వంగల్లు జీవితంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో వంగల్లు కోదండరామిరెడ్డి కుమార్తె సుభాషిణి, మనుమరాలు సుమిత, వంగల్లు ద్వారకానాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కోదండరామిరెడ్డి తదితర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

### 'ఉచితాలు'.. సముచితం కాదు

ఎన్నికల్లో బాధ్యతారహితంగా హామీలు ఇవ్వకూడదని,'అన్నీ ఉచితంగా ఇస్తామనడం, ఒకరు అయిదిస్తానంటే..మరొకరు పదిస్తామని హామీలివ్వడం..వంటివన్నీ మంచిపద్ధతులు కావని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా అన్నం పెట్టడం, విద్య-వైద్యం ఉచితంగా అందించడం వంటివి మంచివే. అయితే, అన్నిటినీ ఫ్రీగానే ఇస్తామనడం ఏమిటి?..అది ప్రజల డబ్బు..బాధ్యతారహితంగా హామీలు ఇవ్వకూడదు. ఇది ఏ ఒక్కరి గురించో చెప్పడం లేదు, ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటివే ఉంటున్నాయి. అందువల్ల, ప్రజలకు ఇచ్చే హామీలకు చట్టబద్ధత కల్పించేవిధంగా, అవసరమైతే చట్టాలను సవరించాలని కూడా ఆయన సూచించారు. రాజకీయాల్లో ఎవరి విధానాలు వారికుంటాయని, అయితే ఎవరినీ దూషించే విధానం మంచిది కాదని, అభ్యర్థులు ప్రత్యర్థులుగా ఉండాలే తప్ప.. శత్రువులుగా ఉండకూడదని వెంకయ్య హితవు పలికారు.

# వైద్యులు మానవత్వంతో సేవలందించాలి

## ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల స్నాతకోత్సవంలో మన వెంకయ్య



'ఆరోగ్య సంరక్షణా సౌధానికి నైతిక విలువలే బలమైన పునాది'..అని, మానవత్వంతో వైద్యులు సేవలందించాలని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. ఈనెల 6న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సం (గ్రాడ్యుయేషన్ డే) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో వైద్యుడిగా సేవలు అందించడమనేది ఓ వృత్తి మాత్రమే కాదని, రోగుల పట్ల దయ-కరుణతో పాటు వృత్తిలో నైపుణ్యం, నిబద్ధతలతో విధులను నిర్వహించే ఒక మానవీయ మార్గమని అన్నారు. సమాజంలో ప్రతి అడుగులోనూ వైద్యుల ప్రభావం ఎంతగానో కనిపిస్తుందని, వారు పాటించే నైతిక ప్రమాణాలు సమాజ భవిష్యత్తును నిర్ణయిస్తాయని అన్నారు. వైద్యవృత్తిలో ఆదాయాన్ని సంపాదించాలనుకోవడం వైద్య రంగానికి ఏ విధంగానూ మంచిది కాదని, మానవీయ విలువలను కోల్పోకుండా వైద్యులు సేవలు అందించాలని, సమాజం పట్ల గౌరవం, మానవతా విలువలే వైద్యవృత్తిలో ఉన్న వారి విలువను మరింతగా పెంచుతాయని తెలిపారు.

### వైద్యులంటే.. భగవంతుని స్వరూపాలే

భారతీయ సంస్కృతి సైతం వైద్యులను సాక్షాత్తు భగవంతుని స్వరూపాలుగా భావించి గౌరవించిందని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ విషయాన్ని వైద్యులు గుర్తుంచుకుని తమ విధులను బాధ్యతతో గుర్తించాలన్నారు. నెల్లూరీయునిగా 5 దశాబ్ధాల ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్థానాన్ని తాను స్వయంగా గమనించానన్నారు. సుమారు 67.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ సంస్థ వైద్య విద్య, నాణ్యమైన ఆరోగ్య సేవలకు చిహ్నంగా మారిందని, నెల్లూరు ప్రజలకు మాత్రమే కాకుండా, పొరుగు జిల్లాల ప్రజలకు కూడా ప్రత్యేక వైద్య సేవలు అందించటంలో ఈ సంస్థ ప్రాముఖ్యత సంతరించుకుందని పేర్కొన్నారు. వైద్య విద్యార్థుల జీవితంలో గ్రాడ్యుయేషన్ డే ప్రాముఖ్యతను ప్రత్యేకంగా వివరించిన ఆయన, వైద్య వృత్తితో పోల్చదగినది ఏదీ లేదన్నారు. వైద్య వృత్తిలో నైపుణ్యం పెంచుకోవడానికి ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్ళండి.. ఆ సేవలను మాత్రం ఈ దేశంలో అందించే నిబద్ధత కలిగి ఉండండి..అని ఆయన ఈ సందర్భంగా వైద్యవిద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు సేవ చేయటానికి వైద్యులు సంసిద్ధులు కావాలన్నారు. రోగుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ వహించి, ప్రతి ఒక్కరికీ ఉండే ప్రత్యేకమైన సమస్యల గురించి తెలుసుకుని వారికి సేవలు అందించాలన్నారు. ప్రతి వైద్యుడు రోగులతో కలసిమెలసి ఉంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు. యువ వైద్యుల భుజస్కంధాలపై దేశ భవిష్యత్తు ఉందని, యువతే రేపటి భవిష్యత్తును నిర్మించగలదని పేర్కొన్నారు. ప్రతి వైద్య విద్యార్థి తమ జీవితంలో కొంత కాలాన్ని విధిగా గ్రామాల్లో సేవలు అందించేందుకు కేటాయించే ప్రయత్నం చేయాలని, వ్యాధులు వచ్చాక వైద్యం అందించే విధానం కంటే, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తల మీద గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన పెంచాలని, మారుతున్న కాలం, ఆహారపు అలవాట్లు తదితర అంశాల పట్ల కూడా పల్లె ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా. వసుంధరాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, ఆర్డీవో మలోల, పలువురు నెల్లూరు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com